# నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలి



వైద్య అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు

9లో...

ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం
వార్త
శుక్రవారం28, అక్టోబర్, 2022 16 పేజీలు

## యంత్రలక్ష్మికి మంగళం..!



2 లో..

ఖమ్మం వ్యవసాయం, ప్రభాతవార్త:

వ్యవసాయ రంగంలో మారుతున్న విప్లవత్మాక మార్పులతో యాంత్రీకరణ పరికరాల సేవలు అనివార్యమైనవి. సంప్రదాయ పంటల సాగుకు చరమగీతం పాడడంతో పాటు అధునిక వ్యవసాయ సాగుల పై రైతులు దృష్టి సారించడంతో యంత్రాల ఉపయోగం మరింత పెరిగింది. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన రైతులను వ్యవసాయ రంగంలో ప్రొత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం యంత్రలక్ష్మి పథకంను ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా వీరికి యాభై శాతం పై సబ్సీడి యంత్ర పరికరాలను పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టింది.

## చాతకొండ బెటాలియన్‌ను తనిఖీ చేసిన డీఐజీ



2లో...

లక్ష్మీదేవిపల్లి, ప్రభాతవార్త: మండలంలోని చాతకొండ 6వ బెటాలియన్‌లో వార్షిక తనిఖీల్లో భాగంగా బెటాలియన్స్ డీఐజీ సిద్దిఖీ తనిఖీ చేశారు.

## జాడి బసంత్ పోలీసు ఇన్‌ఫార్మర్ అందుకే హత్య చేశాం

చర్ల శబరి ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ

చర్ల, ప్రభాతవార్త :

ప్రజాద్రోహిగా మారి గత రెండు సంవత్సరాలుగా పోలీసు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నందున వల్లనే జాడి బసంత్‌ను హత్యచేశామని, మావోయిస్టు చర్ల-శబరి ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం పత్రికలకు లేఖ విడుదల చేశారు. 2లో...

## పీఎస్ఆర్ ఛారిటబుల్‌ట్రస్టు ఆధ్వర్యంలో క్రీడా పోటీలు



క్రీడా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న నేతలు

2లో...

ఖమ్మం ప్రభాతవార్త :

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నారు.









# యంత్రలక్ష్మికి మంగళం..!

(మొదటి పేజీ తరువాయి..)

2016–17లో యంత్రలక్ష్మి పథకం ప్రవేశపెట్టి, సబ్సిడి పై యంత్రాల పరికరాలను రైతులకు అందజేసింది. అదేవిధంగా ఈ పథకం ద్వారా ఊరుకో రెండు నుంచి మూడు ట్రాక్టర్లను సబ్సిడి పై పంపిణీ చేశారు. క్రమేపీ ఈ పథకం ద్వారా అర్హులకు కాకుండా అనర్హులకు ట్రాక్టర్లు వెళ్లాయి. అంతేకాకుండా ట్రాక్టర్ల పంపిణీలో స్థానిక నాయకుల జోక్యం తీవ్రంగా ఉండడంతో ప్రభుత్వం కాస్తా ఆలోచనలో పడింది. దీనిపై సమాలోచనల మధ్య అప్పటి నుంచి ఇప్పటి వరకు ట్రాక్టర్లు కేటాయించడం నిలిపివేసింది. కాగా ఇదే పథకం ద్వారా రైతులకు కేజీవీల్,కల్టివేటర్లు, పవర్ స్ప్రేయర్లు యాభై శాతం పై పంపిణీ చేసింది. దీంతో ట్రాక్టర్ల కేటాయించడంలో నెలకొన్న గంధరగోళంలో యాంత్రీకరణ పరికరాలను పంపిణీ చేయకుండా నిలిపివేయడంతో యంత్రలక్ష్మికి మంగళం పాడింద అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో వాటి పైనా ఆధారపడి వ్యవసాయ సాగు చేసుకునే రైతులు ప్రతి సీజన్‌లో ఇబ్బందులు పడుతున్నారు. పొలం దున్నే సమయంలో ఎక్కువగా ట్రాక్టర్లను ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. కేజీవిల్స్ , రోటోవేటర్ లాంటి యంత్రాల ఉపయోగం ఉంటుంది. ప్రతి యేటా సబ్సిడి యంత్రపరికాలతో పంటల సాగు చేసిన రైతులకు ఆరేళ్లుగా సబ్సిడి పరికాల పంపిణీ పథకం పత్తాలేకుండా పోవడంతో ఆర్థికంగా బాగా దెబ్బతింటున్నారు. కూలీల కొరతతో రైతులు ఆ సమస్యను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ పరిస్థితులైనా యంత్ర పరికరాల వాడకం పై దృష్టి సారిస్తున్నారు. వాటిని కొనుగోలు చేయాలంటే రైతులకు అధిక మొత్తంలో పెట్టుబడులు కావడంతో ముందుకు రావడం లేదు. గతంలో మహిళ సంఘాల ద్వారా కూడా పవర్ స్ప్రేయర్లు, రోటోవేటర్‌లు, కల్టివేటర్లు రైతులకు అద్దెకు ఇచ్చేవారు. కానీ ఆ యంత్ర పరికరాలు సంఘాల ద్వారా కనిపించకపోవడంతో రైతులకు మరింత ఇబ్బందులు పడుతున్నారు. వరి తర్వాత పంటల సాగులో పత్తి పంట నిలుస్తుంది. ఈ పంట సాగులో సైతం ట్రాక్టర్ల వినియోగంతో పాటు యంత్ర పరికరాల ఉపయోగం ఎక్కువగా ఉంటుంది. పండించిన పంటలను కొనుగోలు కేంద్రాలతో పాటు పత్తిమిల్లులకు తీసుకవెళ్లేందుకు ట్రాక్టర్ల వాడకం రైతులు ఎక్కువగా వినియోగస్తున్నారు. దీంతో రైతుల అవసరాలను, వారిని మరింతా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తిరిగి రైతుల ముగింట్లోకి యంత్రలక్ష్మి పథకం అందించేలా పునఃప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

# ప్రజాస్వామ్యం ఖూనీ

## రాజకీయ వికృత చర్యలు

## ప్రజలు చీ కొడుతున్న సిగ్గు లేదు

## భగ్గుమన్న తెరాస శ్రేణులు

## నియోజకవర్గంలో మోడీ దిష్టిబొమ్మ దహనం

**రఘునాథపాలెం, అక్టోబర్ 27 ప్రభాతవార్త:**

ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులను ప్రలోభపెట్టి కొనుగోలు చేయడం ప్రజాస్వామ్యం ఖునీ అవుతుందని నిరసన వ్యక్తం చేస్తూ గురువారం ఖమ్మం నియోజకవర్గంలో తెరాస శ్రేణులు పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదేశాల మేరకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాటకీయ పరిణామాల మధ్య శాసనసభ్యులను ప్రలోభపెట్టి కొనుగోలు చేయాలనే బీజేపీ కుట్రలను తిప్పి కొట్టినందుకు నిరసనల సెగ నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున నాయకులు,కార్యకర్తలు, పార్టీ శ్రేణులు ప్రదర్శనలు నిర్వహించి ప్రధాని నరేంద్రమోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎమ్మెల్యేలకు డబ్బుతో కొనుగోలు చేయాలనే బీజేపీ ఆటలు సాగవని ఈ సందర్భంగా నినాదాలు చేస్తూ కార్యకర్తలు మోడీ దిష్టిబొమ్మతో హల్ చల్ చేశారు. మోడీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ కూడలి ప్రాంతాల్లో వివిధ ఏరియాల్లో దిష్టి బొమ్మలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాజకీయ వికృత చర్యలకు పాల్పడుతున్న బీజేపీని ప్రజలు చీకొడుతున్న సిగ్గు లేదని విమర్శించారు. ప్రజల్లో సిఎం కేసీఆర్‌కు లభిస్తున్న ఆధరణను తట్టుకోలేక రాజకీయ పబ్బం కోసం ఇలాంటి కుట్రలకు పాల్పడటం శోచనీయమన్నారు. తెలంగాణ ప్రభుత్వాన్ని కూలదోయాలనే కుట్రలో భాగంగానే హైదరాబాద్‌లో పట్టుబడిన బీజేపీ నేతల నిజ స్వరూపం బయటపడిందన్నారు. ఉద్యమ నాయకులు కావటం వల్లే కుట్రను భగ్నం చేశారని, సంతల్లో గొర్రెల మాధిరిగా శాసనసభ్యులను కొనుగోలు చేయాలనే బీజేపీ ఆటలు, కుయుక్తులు తిప్పి కొట్టినందుకు పలువురు హర్షం వ్యక్తంచేశారు. కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ ముందుకు దూసుకుపోతోందని, ఎన్నికల్లో గెలిచే దమ్ము లేక బీజేపీ దొడ్డిదారిన ఇలాంటి ప్రయత్నాలు చేసి అభాసుపాలైందన్నారు. ప్రభుత్వాలను ఇతర రాష్ట్రాల్లో కూల్చిన మాదిరిగా తెలంగాణలో బీజేపీ ఎరచూపిన డబ్బు ఇందుకు నిదర్శనమని ప్రలోభాల కుట్రను బట్టబయలు చేసిన వారి నిజాయితీకి అద్దం పడుతుందని పేర్కొన్నారు. నేరుగా ఎన్నికల్లో పోటీ చేసే దమ్ము , ధైర్యం లేని బీజేపీ నేతలు వక్ర మార్గంలో డబ్బును విరజిమ్మి కొనుగోలు చేయటానికి తెరాస ఎమ్మెల్యేలు ఎవరూ సిద్ధంగా లేరని హెచ్చరించారు. మోడీ, అమిత్‌షా ఎన్ని కుయక్తులు, కుట్రలు పన్నినా ఒక్క ఎమ్మెల్యేను కూడా చీల్చలేరని హితవు పలికారు. దేశవ్యాప్తంగా కేసీఆర్‌కు లభిస్తున్న ఆధరణను చూసి తట్టుకోలేక కేంద్రంలోని మోడీ, అమిత్‌షా అవినీతిని ప్రశ్నిస్తున్నందు వల్లే ఇలాంటి డ్రామాలకు తెర లేపారన్నారు. తొలుత గ్రామాల నుండి ప్రదర్శనగా బయలుదేరిన కార్యకర్తలు రఘునాథపాలెం కేంద్రంలో ఆందోళన నిర్వహించి దిష్టి బొమ్మలను దగ్ధం చేశారు. అనంతరం అక్కడి నుండి భారీగా తరలివచ్చిన శ్రేణులు ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయం, ఇల్లందు సర్కిల్ వరకు మోడీ దిష్టిబొమ్మను ఊరేగించి దహనం చేశారు.





# రాజీవ్ గృహ కల్ప సమస్యలు పరిష్కరించాలని

# ఎంపిడివో కార్యాలయం ముందు ధర్నా

**ఖమ్మం రూరల్, అక్టోబర్ 27 ప్రభాతవార్త:**

ఖమ్మం రూరల్ మండలంలో పోలేపల్లి పంచాయతీ పరిధిలో గల రాజీవ్ గృహకల్పలో అపరిష్కృతంగా ఉన్న సమస్య సమస్యలను పరిష్కరించాలని రాజీవ్ గృహకల్ప ఏరియా ప్రాంత ప్రజలు గురువారం నాయుడుపేటలోని ఎంపిడివో కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. రాజీవ్ గృహకల్పలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని వారు నినదించారు. ఈ ధర్నాకు సంఘీభావంగా సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు పాల్గొన్నారు. ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి ఆవుల అశోక్, మండల కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. 18 రకాల ప్రధాన సమస్యలను గుర్తించామని వీటిని అధికారులు తక్షణమే పరిష్కరించాలని వారు అన్నారు. సిసి రోడ్లు గాని బీటీ రోడ్లు గాని లేక రాకపోకలు చాలా కష్టంగా మారాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వీధి దీపాలు లేక రాత్రి రాకపోకలు చాలా కష్టంగా ఉండిందని, రాష్ట్రమంతా మిషన్ భగీరథ ఫిల్టర్ వాటర్ ఇస్తూ రాజీవ్ గృహకల్పకు మాత్రం ఇవ్వకుండా బాధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెయ్యి కుటుంబాలు నివాసం ఉంటున్న రాజీవ్ గృహకల్ప ఏరియాలో కనీసం రేషన్ షాపు కూడా లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇల్లు లేని పేదలకు పోలేపల్లి రెవెన్యూలో ఉన్న ప్రభుత్వ భూములు, ఇళ్ల పట్టాలు అందించాలని వారు డిమాండ్ చేశారు. తక్షణమే రాజీవ్ గృహకల్పలో ఉన్న ప్రజా సమస్యల పరిష్కారానికి పూనుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఏరియా వాసులతో కలిసి ఎంపీపీ, జడ్పీటీసీ ఎంపిడివోకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపిడివో ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా నాయకులు ఝాన్సీ, చందు, రాజీవ్ గృహ కల్ప ఏరియా నాయకులు రామారావు, శారద, జాస్మిన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# చాతకొండ బెటాలియన్‌ను తనిఖీ చేసిన డీఐజీ

(మొదటి పేజీ తరువాయి..)

దేశ పోలీస్ వ్యవస్థకే వెన్నెముకగా టీఎస్‌ఎస్పీ వ్యవస్థ నిలిచిందని పేర్కొన్నారు. చాతకొండలోని 6వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన గురువారం పర్యటించారు. పరేడ్ సిబ్బంది కవాతును పరిశీలించి గౌరవ వందనాన్ని స్వీకరించారు. శిక్షణలో, విధి నర్వహణలో పోలీస్ సిబ్బంది చూపించే ధైర్యసాహసాలు పోలీస్ వ్యవస్థకే వన్నె తెచ్చాయని ప్రశంసించారు. అనంతరం నిర్వహించిన దర్బార్‌లో సిబ్బంది సమస్యలను తెలుసుకున్నారు. కమాండెంట్ వీవీ రమణారెడ్డి, అదనపు కమాండెంట్ శ్రీనివాసరావు, సహాయ దళాధిపతులు సీతారాం, కాళిదాసు, వీరన్న, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.

## జాడి బసంత్ పోలీసు ఇన్‌ఫార్మర్

# అందుకే హత్య చేశాం

(మొదటి పేజీ తరువాయి..)



బసంతన గ్రామకమిటీ దళం వివరాలు ఎప్పటికప్పుడు పోలీసులకు చేరవేస్తున్నాడని, పోలీసులిచ్చే డబ్బులకు ఆశపడి ఇలా చేస్తున్నాడని, పూర్తిగా పోలీసు కంట్రోల్ రూంలో ఉంటూ పార్టీ మీటింగ్‌లకు వస్తూ ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తున్నాడని లేఖలో తెలిపారు. పూజారి కాంకేర్ గ్రామ సమాచారం తెలపడం, దళాన్ని పట్టిస్తే రూ.10లక్షలు ఇస్తామని ఎస్సై తెలపడంతో దళం ఆచూకీ కోసం ప్రయత్నాలు చేశాడని తెలిపారు. ఈ విధంగా జాడి బసంత్ మారడంతో పీఎల్‌జీఏ సభ్యులు పట్టుకుని వచ్చారని, గ్రామస్తుల ప్రజాకోర్టు నిర్వహించి తప్పులు ఒప్పుకున్నాక మెజార్టీ సభ్యుల అభిప్రాయం మేరకే మరణ శిక్ష విధించడం జరిగిందని అరుణ పేరిట పత్రికలకు విడుదల చేసిన లేఖలో పేర్కొని ఉంది.

## పీఎస్ఆర్ ఛారిటబుల్‌ట్రస్టు

# ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

(మొదటి పేజీ తరువాయి..)

ఖమ్మంలో సర్దార్ పటేల్ స్టేడియంలో డే అండ్ నైట్ కబడ్డీ పోటీలు, కొత్తగూడెంలోని ప్రకాశం మైదానంలో వాలీబాల్ పోటీలు జరగనున్నాయి. కబడ్డీ పోటీలు 28 నుంచి 30వ తారీఖు వరకూ, వాలీబాల్ పోటీలు 28 నుంచి 31వరకూ నిర్వహించనున్నారు.

పోటీలకు హాజరయ్యే క్రీడాకారుల కోసం ఉచిత భోజన వసతి సౌకర్యాలు కల్పించినట్టు ట్రుస్టు బాధ్యులు తెలిపారు. పురుషులు, మహిళా విభాగాల్లో కబడ్డీ, జూనియర్స్ బాలబాలికలకు వాలీబాల్ పోటీలు నిర్వహిస్తారు. కబడ్డీ విజేతకు రూ.లక్ష మొదటి బహుమతిగా అందజేస్తారు. ఈ టోర్నికి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

# కార్తీక మాస అన్నదానం ప్రారంభం

## శ్రీ శిరిడి సాయి ఆశ్రమంలో మహా అన్నదానం

**ఖమ్మం రూరల్, అక్టోబర్ 27 ప్రభాతవార్త:**

ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి పంచాయతీ పరిధిలోని ద్వారకామయి శ్రీ శిరిడి సాయి సేవాశ్రమంలో గురువారం కార్తీక మాస అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నేటి నుంచి వచ్చే నెల 24 వరకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నెల రోజుల పాటు సాగనున్న అన్నదానాన్ని అయ్యప్ప, భవాని, సాయిబాబా భక్తులు స్వీకరించాలని ద్వారకామయి శ్రీ శిరిడి సేవాశ్రమం అధ్యక్షులు కటకం చిన్న హనుమంతరావు (బాబు)కోరారు. భక్తులకు మెరుగైన సేవా కార్యక్రమాలు అందించాలన్న దృక్పథంతో గత అనేక ఏండ్లుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామని, ఆ శిరిడీ సాయిబాబా ఆశీస్సులు ప్రతి కుటుంబంలో వెలుగులు నింపాలని కోరారు. అయ్యప్ప భక్తులకు తమ ఆశ్రమం ద్వారా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

భక్తుల సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తుళ్లూరు మోహన్‌రావు, కోశాధికారి విడల శ్రీనివాసరావు, దాసరి వీరభద్రం, జంగిలి నాగేశ్వరరావు, బోడేపూడి వీరయ్య, గోపిశెట్టి నాగేశ్వరరావు, పూర్ణచందర్‌రావు, కంచర్ల శివనాగేశ్వరరావు, సాదు లక్ష్మణ్‌రావు, పలువురు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు పోలీస్ గస్తీ ముమ్మరం చేయాలి

**బాధితుల పట్ల మర్యాదగా నడుచుకోవాలి...**

**పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్ వారియర్**

*కామేపల్లి, అక్టోబర్ 27, ప్రభాతవార్త :*

నేరాల నియంత్రణకు పోలీస్ గస్తీ మరింత ముమ్మరం చేయాలని పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్ వారియర్ పోలీస్ అధికారులను గురువారం ఆదేశించారు. ప్రధాన రహదారిలోని కామేపల్లి పోలీస్ స్టేషన్‌తో పాటు కారేపల్లి పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని పోలీస్ కమిషనర్ సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిసనర్ మాట్లాడుతూ... పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా మెలగాలని, ప్రతి ఒక్కరికి జవాబుదారీగా ఉండాలని సూచించారు. రిసెప్షన్ సిబ్బంది విధులు ఏ విధంగా నిర్వర్తిస్తున్నారో వివరాలు తెలుసుకున్నారు. రిసెప్షన్ రికార్డులను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహిసునతన్న ఫంక్షనల్ వర్టికల్స్‌ను



సమీక్షించారు. 5ఎస్ అమలులో భాగంగా పోలీస్ స్టేషన్‌లలో స్టేషనరీ విభాగం పరిశుభ్రంగా ఉంచాలని, అదే విధంగా అవసరమైన రికార్డులు, వస్తువుల క్రమపద్ధతిలో పెట్టడం, పరిసరాలలో సురక్షితమైన, ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. స్టేషన్ హౌస్ మేనేజ్‌మెంట్, పోలీస్ స్టేషన్ నిర్వహణ, యూనిఫాం, రెగ్యులర్ రోల్ కాల్, వీక్లీ పరేడ్ గురించి సిబ్బంది గురించి సిబ్బంది అధికారులు విధిగా అమలు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. పెట్రో కార్ సిబ్బంది ఏ విధమైన విధులు నిర్వహిస్తున్నారు...? బీట్ డ్యూటీ సిబ్బంది ట్యాబ్ ద్వారా క్రైమ్ ప్రో ఏరియాను ఏ విధంగా గుర్తిస్తున్నారు...? జియో ట్యాగ్ ద్వారా పాత నేరస్తుల నివాసాలను కదలికలను ఏ విధంగా గుర్తిస్తున్నారో ట్యాబ్ ద్వారా చూపించాలని ఆదేశించారు. స్టేషన్ ఆవరణను పరిశీలించి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌ను, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కమ్యూనిటీ పోలిసింగ్‌లో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటు చేయడం ద్వారా కలిగే ఉపయోగాలను స్థానికులు వివరించి స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు పెట్టుకొనే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ ఏసీపీ బసవరెడ్డి, సింగరేణి రూరల్ సీఐ ఆరీఫ్ అలీ ఖాన్, ఎస్సై అన్నం కిరణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫోర్జరీ సంతకాలతో కాగితాలు మార్పిడి

*అశ్వాపురం,అక్టోబర్27,ప్రభాతవార్త.*

స్నేహం ముసుగులో ఫోర్జరీ సంతకాలు పెట్టి భూమి కొనుగోలుచేసిన కాగితాలు తారుమారు చేసి ప్రాణస్నేహితుడినే మోసంచేసిన ఘటన మండలపరిధిలోని గౌతమీనగర్‌లో జరిగింది. వివరాల్లోకెళితే, భారజల కర్మాగారంలో సోమందుల వెంకటేశ్వర్లు,న క్కా వినయసాగర్ సహోద్యో గులుగా గత 15యేండ్లుగా కలిసి పని చేస్తున్నారు. ఇద్దరూ కలసి 2010 వ సంవత్స రంలో గార్లబయ్యారం మండలంలోని గంధం పల్లిలో సర్వేనెంబర్ 59లో ఎకరం భూమి కొనుగోలు చేసి ఇరువురు కలసి కొన్నట్లుగా కాగితాలు వ్రాయించుకున్నారు .మరుసటి సంవత్సరమే వినయసాగర్ ఫోర్జరీ సంతకాలతో తన పేరు మీదకు కాగితాలు మార్పించుకున్నాడు.ఇటీవల వెంకటేశ్వర్లు కుమారుడు మృతిచెందడం,మరో కుమారుడు గుండెకు వ్యాధితో బాధపడుతుండగా, డబ్బు అవసరం కాగా,మిత్రుడిని కలసి నా వాటా భూమిని అమ్మదల చుకున్నాను.నీకు కావాలంటే తీసుకో లేదా వేరే వారికి విక్రయిస్తానని చెప్పడం తో, ఇంకెక్కడి భూమి దాన్ని గురించి మర్చిపో



అనడంతో అవాక్కయిన వెంకటేశ్వర్లు బయ్యారం పోలీసులను ఆశ్రయించాడు.

# ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలి

**ఎస్సై వరాల శ్రీనివాస్**

*తిరుమలాయపాలెం, ప్రభాతవార్త :*

ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలని తిరుమలాయపాలెం ఎస్సై వరాల శ్రీనివాస్ గురువారం పేర్కొన్నారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్ వారియర్ ఆదేశ్యాల మేరకు ఖమ్మం రూరల్ ఏసీపీ





బస్వారెడ్డి, కూసుమంచి సర్కిల్ సీఐ సతీష్, ఎస్సై వరాల శ్రీనివాస్ సూచనల మేరకు పోలీస్ జన జాగృతి కళాకారుల ఆధ్వర్యంలో మండల పరిధిలోని పిండిప్రోలు గ్రామంలో మూఢ నమ్మకాలపై ఆన్‌లైన్ మోసాలు నాటుసారా హెచ్ఐవి, గంజాయి లాంటి మాదకద్రవ్యాలపై కళాకారుల నాటికల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఎస్సై వరాల శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ.... ప్రపంచం ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతుంటే కొంతమంది గ్రామాల్లో ఇంకా మూడనమ్మకాలు నమ్ముతూ జీవిస్తున్నారు. ఒక పక్క పరిగెడుతున్న కాలంతో పాటు టెక్నాలజీ కూడా అదే విధంగా పరిగెడుతుంటే ప్రజలు మూఢ నమ్మకాలను నమ్మడం సరికావు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత విద్యలు చదివించి వారికి మెరుగైన జీవితాన్ని అందించాలని వారు తప్పుడు, చెడు అలవాట్లకు గురి కాకుండా ఎప్పటికప్పుడూ గమనిసూనత ఉండాలని ప్రపంచాన్ని పట్టిపీడించిన కరోనా మహమ్మారి వల్ల లాక్‌డౌన్ విధించడంతో విద్యార్థులు ఎంతో మంది ఆన్‌లైన్ క్లాసులు పేరుతో సెల్ ఫోన్లను ఎక్కువగా దగ్గరయ్యారు. దానివల్ల మంచికన్నా చెడు ఎక్కువ జరిగిందని ఆయన వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా తల్లిదండ్రులు పిల్లలకు సెల్ ఫోన్లు దూరంగా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాయల నాగేశ్వరరావు, ఎంపీటీసీ పులుగుజ్జు వెంకటేశ్వర్లు, దొండేడి నిర్మలరావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# దెయ్యం .. బాబోయ్ .. దెయ్యం

**-భయభ్రాంతులకు గురైన మహిళలు**

*దుమ్ముగూడెం, ప్రభాతవార్త :*

ప్రతి రోజు ఉదయాన్నే వాకింగ్‌కు అని వెళ్తున్న మహిళలకు ఒక అనుకోని సంఘటన ఎదురవ్వ డంతో భయభ్రాంతులకు గురై దెయ్యం .. బాబోయ్ .. దెయ్యం అని పరుగుతీసిన సంఘటన వర్క్‌షాపు గ్రామశివారులో గురువారం తెల్లవారుజామున జరిగింది. .. దుమ్ముగూడెం గ్రామానికి చెందిన కొంతమంది మహిళలు నిత్యం తెల్లవారుజామున వాకింగ్‌కు అని దుమ్ముగూడెం గ్రామం నుండి దుమ్ముగూడెం క్రాస్ రోడ్డు వరకు వెళ్ళి వస్తుంటారు. ఈ క్రమంలో మద్యలో ఉన్న వర్క్‌షాపు గ్రామశివారులోకి వెళ్ళగానే ఒక చెట్టుపక్కన మంచు ఆకారంలో మనిషి రూపం ఉండడంతో తమ చేతిలో ఉన్న ఫోన్ ద్వారా ఆ చిత్రాన్ని బంధించే ప్రయత్నం చేశారు. క్షుణ్ణంగా పరిశీలించగా దెయ్యం ఆకారంలో ఉన్న ఆ రూపాన్ని చేసి భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే అక్కడ నుండి పరుగులు తీశారు. ఈ విషయం ఆ నోటా ఈ నోటా గ్రామంలో వ్యాపిం



చి ఆ ప్రాంతం వైపు వెళ్ళాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. ఇది దెయ్యమో .. భయమో అర్థంకాక మిగతా ప్రజలు, వర్క్‌షాపు గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

# నేరాలు-దారుణాలు

## వెంకటరామ్ మృతి తీరని లోటు



*కామేపల్లి, అక్టోబర్ 27, ప్రభాతవార్త :*

బండిపాడు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో జర్పుల వెంకటరామ్ గురువారం మరణించారు. వారి గృహంలో జరిగిన దశదిన కర్మలలో డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ వెంకటరామ్ మృతి వారి కుటుంబానికి తీరని విషాదం మిగిలిచిందని, ఎంతో నిబద్దత గల కార్యకర్తను పార్టీ కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబానికి ధైర్యం చెప్పి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రుక్కీతండా సర్పంచ్ లకావత్ భీమా, ఎల్‌హెచ్‌పీఎస్ మండల అధ్యక్షులు భూక్యా నాగేంద్రబాబు నాయక్, గౌడ సంఘం నాయకులు పల్లె వెంకటరాములు, గుగులోతు రవినాయక్, లకావత్ రాములు పాల్గొన్నారు.

## గుండెపోటుతో ప్రముఖ క్రీడాకారుడు మృతి



*వైరా,అక్టోబర్27,ప్రభాతవార్త:*

వైరా పట్టణానికి చెందిన ప్రముఖ షటిల్ క్రీడాకారుడు షేక్ గని గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన భౌతికఖాయాన్ని వైరా శాసనసభ్యులు లావుడ్యా రాములునాయక్ సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన మృతి పట్ల క్రీడాకారులు సంతాపాన్ని వెల్లబుచ్చారు. ఎమ్మెల్యే వెంట మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్, వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, దిశా కమిటీ సభ్యులు కట్టా కృష్ణార్జున్‌రావు, కోఆప్షన్ సభ్యులు అప్పం సురేస్, మత్స్యశాఖ చైర్మన్ షేక్ రహీం, నాయకులు ఫణితి సైదులు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## కులం పేరుతో దూషించారంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



*పెనుబల్లి, అక్టోబర్ 27, ప్రభాతవార్త*

కులం పేరుతో దూషించారని మరో కులానికి చెందిన కులస్థులు అందరూ కలిసి గురువారం వీ.యం. బంజర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. మండల పరిధిలోని తుమ్మలపల్లికి చెందిన ఓ కులంకు చెందిన యువకులు మరో కులానికి చెందిన వారిని దూషించారని, ఆ కులానికి చెందిన సుమారు వంద మంది వీ.యం. బంజర్ స్టేషన్‌కు గురువారం వచ్చారు. ఎస్సై సూరజ్ ఫిర్యాదును స్వీకరించి విచారణ జరిపి, తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.




## ఓటర్ ఐడీకి ఆధార్ నెంబర్‌ను అనుసంధానం చేసుకొండి

**-తహసిల్దార్ భగవాన్‌రెడ్డి**

సారపాక, ప్రభాతవార్త :



ఓటర్ ఐడీకి ఆధార్‌నెంబర్ అనుసంధానం చేసుకోవాలని తహసిల్దార్ ప్రజలకు సూచించారు. గురువారంబూర్గంపహాడ్ మండల పరిధిలో గల పలు గ్రామాల్లో స్వయంగా తహసిల్దార్ భగవాన్‌రెడ్డి తిరుగుతూ ఓటర్ ఐడీకి ఆధార్ అనుసంధానం తప్పనిసరి అని ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటర్ ఐడీకి ఆధార్ నెంబర్ లింక్ చేయకపోతే మీ విలువైన ఓటు కోల్పోవడమేకాక జనాభా లెక్కలలో మీ పేర్లు నమోదు కావని, రేషన్ బియ్యం, పలు ప్రభుత్వ పథకాలకు అర్హులు కారని, కావున ఆధార్ లింక్ చేయించుకోని వారు తప్పనిసరిగా లింక్ చేయించుకోవాలని తెలిపారు. తహసిల్దార్ వెంట ఆర్ అక్బర్, విఆర్‌ఏలు ముత్యం, శ్రీను, నాగేశ్వరరావులు ఉన్నారు.

## శ్రీదత్తశేషసాయి బాబా మందిరంలో ప్రత్యేక పూజలు

దుమ్ముగూడెం, ప్రభాతవార్త :



దుమ్ముగూడెం గ్రామంలో తరతరాలుగా వెలసి ఉన్న శ్రీదత్తశేషసాయిబాబా మందిరంలో గురువారం సాయిబాబా వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా మందిరంలో బాబా వారికి అభిషేకం, కాగడ హారతి, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు సాయిబాబా వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు వి.టీ.వీ.రమణారావు, బైరెడ్డి జయవెంకటరమణ, కెల్లా శేఖర్, కెల్లా వేణుగోపాల్, బైరెడ్డి సీతారామారావు, తదితరులు పాల్గొన్నారు.

## సర్వేలు న్యాయబద్ధంగా నిర్వహించాలని తహసిల్దార్‌కు వినతి

బూర్గంపహాడ్, ప్రభాతవార్త :

సర్వేల పేరుతో ప్రజలకు గ్రామాలలో అధికారులు గందరగోళం పరుస్తున్నారని, అక్రమంగా ఫారెస్టు వారు ఆక్రమించుకున్న భూములను తిరిగి పోడురైతులకు ఇవ్వాలని కోరుతూ సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ పాల్వంచ సబ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ .. గ్రామాలలో రెవెన్యూ, ఫారెస్టు సిబ్బంది వెళ్ళి సర్వేలు చేపట్టడంలో న్యాయబద్దంగా వ్యవహరించడం లేదని, తక్షణమే న్యాయబద్ధంగా వ్యవహరించి సర్వేలు సక్రమంగా నిర్వహించాలని కోరారు. నంతరం తహసిల్దార్ భగవాన్‌రెడ్డి మాట్లాడుతూ .. సర్వేల విషయంలో ఎలాంటి తారతమ్యబేధాలు లేకుండా సర్వేలు చేపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు వై.ఎస్.రెడ్డి, సత్యనారాయణ, బర్ల రామకృష్ణ, రవి, లక్ష్మన్, ఆర్.లక్ష్మి, పాషా, జ్యోతి, ముంతాజ్, తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు సంబంధించిన వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలి

భద్రాచలం, ప్రభాతవార్త :



ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నడుస్తున్న గిరిజన సహకార సంస్థ, నిత్యావసర వస్తువుల విక్రయశాల యందు అమ్మకం కొనుగోలు సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో ప్రత్యేక యాప్ ద్వారా నమోదు చేయడానికి ప్రత్యేక శిక్షణ ద్వారా అందరికి వివరించడం జరిగిందని గిరిజన సహకార సంస్థ జీఎం సీతారాంనాయక్ అన్నారు. గురువారం భద్రాచలం ఐటిడిఏ సమావేశం మందిరంలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ ముగింపు సందర్భంగా ఆయనమాట్లాడుతూ .. మారుమూల ప్రాంతాలలో నివసిస్తున్న ఆదివాసీ గిరిజన గ్రామాల్లోని కుటుంబాలు ఉదయాన్నే లేచి సమయం కూడా చూడకుండా అటవీ ఫాలాలు సేకరించడానికి వెళ్తూ ఉంటారని, వారు సేకరించిన ప్రతి వస్తువు గిరిజన సహకార సంస్థకు సంబంధించిన డిఆర్‌డీపోలలో విక్రయించడానికి వస్తూ ఉంటారని, వారికి ఎటువంటి అన్యాయం జరగకుండా చూడడానికి ఇటువంటి యాప్‌లు ప్రవేశపెట్టడం జరిగిందని ఆయన అన్నారు.కానీ ప్రస్తుతం మన గిరిజన సహాకార సంస్థ ద్వారా పెట్రోల్ బంకులు పనిచేస్తున్నాయని, వాటి ద్వాఆర గిరిజన నిరుద్యోగ యువకులు ఉపాధి పొందుతున్నారని, అదేవిదంగా ఇంకా కొన్ని చోట్ల పెట్రోల్ పంపులు నిర్మాణం కొరకు స్థల సేకరణ జరుగుతుందని,తొందర్లో పెట్రోల్ పంపులు నిర్మాణం చేపట్టి గిరిజన నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పించడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని, దాన్ని దృష్టిలో పెట్టుకుని గిరిజనుల కోసం సేవ చేసే మనం గిరిజనులకు ఎటువంటి అన్యాయం జరగకుండా చూడడానికి ఇటువంటి యాప్‌లు ప్రవేశపెడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎం జీసీసీ కుంజా వాణి, యాప్‌కు సంబంధించిన సీజీసీ కన్వీనర్ సత్యనారాయణ, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని జీసీసీ మేనేజర్లు, సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కే.రేగుబల్లి ఆశ్రమ పాఠశాలను సందర్శించిన అధికారులు

దుమ్ముగూడెం, ప్రభాతవార్త :



మండల పరిధిలోని లక్ష్మీనగరం గ్రామంలో ఉన్న కే.రేగుబల్లి ఆశ్రమ పాఠశాలను భద్రాచలం ఐటిడిఏ పరిధిలో ఆశ్రమ పాఠశాలను కాకతీయ గవర్నర్స్, ఫెలో, ప్లానింగ్ విభాగం అధికారులు పీ.శ్రావణి, అకడమిక్ ఓఎస్‌డీ డీ.సుధాకర్ గురువారం కే.రేగుబల్లి ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్ధులకు అందుతున్న విద్యామెనూ సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సైన్స్ ల్యాబ్, లైబ్రరీ , వసతి, తరగతి గదులను తనిఖీ చేసి విద్యార్ధులతో మాట్లాడారు. వసతులు కల్పన, మెరుగైన విద్యకు కావాల్సిన సౌకర్యాలను వారు గుర్తించారు. ఈ కార్యక్రమంలో పీఎంఆర్‌సీ విద్యావిభాగం అదికారులు టి.రమణమ్మ, ఎస్.వెంకటేశ్వర్లు, టి.శ్రీనివాస్, బీ.శ్రీను, మంగతాయారు, హనుమంతు, పాఠశాల హెచ్.ఎం.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-నిమ్మలగూడెం గ్రామంలో ఉచిత వైద్యశిభిరం**

దుమ్ముగూడెం, ప్రభాతవార్త :



సీజనల్ వ్యాధుల పట్ల ఏజెన్సీలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భద్రాచలం ఉప వైద్యఆరోగ్య శాఖాధికారి డా.రాజ్‌కుమార్ ప్రజలకు తెలిపారు. నర్సాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని నిమ్మలగూడెం గ్రామంలో గురువారం ఉచిత వైద్యశిభిరాన్ని నిర్వహించారు.ఈ వైద్యశిభిరాన్ని సందర్శించిన డా.రాజ్‌కుమార్ మాట్లాడుతూ .. ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు దోమతెరలను వినియోగించుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆయన తెలిపారు. యాంటీ లార్వా ప్రోగ్రాంను నిర్వహించారు. నర్సాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.చైతన్య ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిభిరం నిర్వహించి రోగులకు మందుల పంపిణీ చేశారు. మలేరియా కో.ఆర్డినేటర్ టి.కృష్ణయ్య, హెచ్‌ఈవో వి.కృష్ణయ్య, నర్సాపురం సూపర్‌వైజర్ జీ.వెంకటేశ్వర్లు, హెచ్.ఏ.బాబురావు, పద్మ, మంగ, మునిమ్మ, భద్రమ్మ తదితర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## మోడీ దిష్టిబొమ్మ దహనం

బూర్గంపహాడ్, ప్రభాతవార్త :



భద్రాద్రికొత్తగూడెం జిల్లా బిఆర్‌ఎస్ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ మరియు పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు ఆదేశానుసారం బూర్గంపహాడ్ మండల కేంద్రంలో గల ప్రధాన రహదారిపై మండల ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి కేంద్ర ప్రభుత్వం (బిజేపీ) చేసినటువంటి కుట్రను ఉద్దేశించి ప్రధానమంత్రి మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు.ఈ కార్యక్రమంలో బూర్గంపహాడ్ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, స్థానిక సర్పంచ్ సిరిపురపు స్వప్న, పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాస్, తెరాస మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, తెరాస పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, మండల యూత్ ప్రెసిడెంట్ గోనెల నాని, పలువురు సర్పంచ్‌లు, మండల ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, కార్య కర్తలు, అబిమానులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా నోడల్ అధికారి

బూర్గంపహాడ్, ప్రభాతవార్త :



బూర్గంపహాడ్ మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలను భద్రాద్రికొత్తగూడెం జిల్లా నోడల్ అధికారి బి.సులోచనరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల తనిఖీలలో భాగంగా గురువారం జూనియర్ కళాశాలను సందర్శించారు. దీనిలో భాగంగా కళాశాలలో విద్యార్ధులకు కౌన్సిలింగ్ నిర్వహించి, విద్యార్ధులకు సమయపాలన పాటించాలని, ఉదయం స్టడీ అవర్స్‌కి హాజరుకావాలని, విద్యార్ధులు హాజరు శాతం పెంచుకోవాలని, అర్దసంవత్సరం వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని, తరగతి గదులకు వెళ్ళి స్వయంగా విద్యార్ధుల సిలబస్ ప్రాక్టికల్స్ నిర్వహణను అడిగి తెలుసుకుని విద్యసమర్ధ్యం పెంపునకు తగు సూచనలు, సలహాలు చేశారు. కళాశాల అకాడమిక్ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీ.చీన్యా, అధ్యాపకులు సీ.హెచ్ నాగేశ్వరరావు, అధ్యాపకబృందం, నాన్‌టీచింగ్ స్టాఫ్, విద్యార్ధులు పాల్గొన్నారు.

# బూటకపు తెరాసకు ప్రజలే తగిన బుద్ధి చెపుతారు

### రాస్తారోకోలో బీజేపీ నాయకులు

*మధిర, అక్టోబర్ 27, ప్రభాతవార్త :*

రాష్ట్రంలో బూటకపు ఎత్తులతో ప్రజలను మోసం చేస్తూ పబ్బం గడుపుకోవాలని చూస్తున్న తెరాస పార్టీకి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్తారని బీజేపీ నాయకులు గురువారం పేర్కొన్నా పట్టణంలోని వైఎస్ఆర్ జంక్షన్ ప్రాంతంలో ఆ పార్టీ శ్రేణులు రాస్తారోకోతో పాటు దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. బాజపా ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పెరుమా లపల్లి విజయరాజు, నియోజకవర్గ కన్వీనర్ ఏలూరు నాగేశ్వరరావులు మాట్లాడుతూ.... మునుగోడులో తెరాస ఓటమి భయంతోనే ఎమ్మెల్యేల కొనుగోలుకు వందకోట్ల



డీలు కుదిరిందని అసత్య ప్రచారాలు చేసిందని వీటిని నమ్మటానికి ప్రజలు సిద్ధంగా లేరన్నారు. దిగజారుడు రాజకీయం చేస్తున్న తెరాసని ప్రజలు తగిన బుద్ధి చెప్పమన్నారని పేర్కొన్నారు. అధికార హోదాతో తెరాస ఎన్ని ప్రలోభాలు పెట్టినా మునుగోడులో ప్రజల ఆశీస్సులు బీజేపీ అభ్యర్థికి ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్ళపల్లి విజయరాజు, జిల్లా బీజేపీ కార్యదర్శి చిలివేరు సాంబశివరావు, జిల్లా అధికార ప్రతినిధి రామిశెట్టి నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కోనా నర్సింహారావు, బీజె వైఎం పట్టణ అధ్యక్షులు కుక్కల రామ్, పట్టణ ఓబీసీ అధ్యక్షులు జీవీ పట్టణ ప్రదాన కార్యదర్శులు పగడాల నాగేంద్రబాబు, బియ్యవరపు రామకృష్ణ, మండల నాయకులు కనపరినత ప్రకాశరావు, పెరుమాళ్ళపల్లి మోహన్‌రావు, పెరుమాళ్ళపల్లి శ్రీకాంత్, బెజ్జం శ్యామ్, భాను తదితరులు పాల్గొన్నారు.

# కామేపల్లిలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం

### బీజేపీ అప్రాజస్వామిక విధానాలను ఖండించండి

*కామేపల్లి, అక్టోబర్ 27, ప్రభాతవార్త :*

తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామికంగా ఎన్నికై ప్రభుత్వంలో ఉన్న ఎమ్మెల్యేలను, ఇతర ప్రజాస్వామ్య ప్రతినిధులను బీజేపీ అప్రజా స్వామిక దురంకారంతో డబ్బు, అధికారం ఎరచూపి కొనుగోలు చేసేందుకు పూనుకోవడం సిగ్గుచేటని బీ ఆర్ఎస్ విమర్శించింది. దేశంలో ప్రజా స్వామికంగా ఎన్నికైన ప్రభుత్వాలను డబ్బు, అధికారం, అహంకరాంతో ఎరచూపి ప్రభుత్వాలని కూల్చాలని, కుట్రలతో తెలంగాణ



ప్రభుత్వాన్ని ఆస్థిర పరచాలని చూస్తున్నదని విమర్శించారు. అందులో భాగంగానే హైదరాబాద్ మొహినాబాద్ ఫామ్ హౌస్‌లో ఒక్కో ఎమ్మెల్యేకు రూ. 100కోట్లు ఇస్తానని ఆశ చూపారని, అట్టి విధానాన్ని తిప్పికొడుతూ టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బహిర్గతం చేసి బీజేపీ విధానాలను తిప్పి కొట్టారని స్పష్టం చేసింది. బీజేపీ అనుసరించిన విధానాలకు నిరసనగా కామేపల్లి మండల బీ ఆర్ఎస్ పార్టీ ఆద్వర్యంలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మను గురువారం మండల కేంద్రమైన కామేపల్లిలో దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ఎస్ జిల్లా నాయకులు అంతోటి అచ్చయ్య, కామేపల్లి సర్పంచ్ అజ్మీరా రాందాస్, పీఏసీఎస్ చైర్మన్ తీర్దాల చిదంబరావు, గ్రామ అధ్యక్షులు కన్నమాల రాంబాబు, ఉపాధ్యక్షులు అజ్మీరా కుమార్, మండల నాయకులు వడియాల కృష్ణరెడ్డి, మూడ్ కృష్ణప్రసాద్, ఏ రాజు, శ్రీనివాసరావు, బన్సీ, రామనర్సయ్య, శ్రీను, రాము, రామకృష్ణ, తూము బాబు, జావీద్, పిక్ల పాల్గొన్నారు.

# బీజేపీ కుట్రలు తెలంగాణ రాష్ట్రంలో సాగవు

*దుమ్ముగూడెం, ప్రభాతవార్త :*

భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్రంలో చేస్తున్న కుట్రలు సాగనివ్వమని బిజేపీని కూకటి వేళ్ళతో పెకిలిస్తామని దుమ్ముగూడెం మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అన్నెం సత్యనారాయణమూర్తి అన్నారు. బిఆర్ఎస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం మండల పరిధిలోని లక్ష్మీనగరం గ్రామంలో ఉన్న ఆ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మాట్లాడుతూ .. హైద్రాబాద్ పార్టీ ఫాంహౌస్‌లో బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు



వ్యవహారాన్ని ఆయన ఖండించారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కూలదోసినట్లు తెలంగాణలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూడా కూలద్రోయడానికి బిజేపీ అనుసరిస్తున్న విధానాన్ని బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు తిప్పి కొట్టారని వారి ఆటలు తెలంగాణ రాష్ట్రంలో సాగవని ఆయన హెచ్చరించారు. కేసిఆర్ చేస్తున్న అభివృద్ధి సంక్షేమం భారతదేశంలో ఎక్కడ లేవని, బిజేపీ పాలిత రాష్ట్రాలలో కూడా లేనన్ని సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్నాయని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కణితి రాముడు, మట్టా వెంకటేశ్వరరావు, కెల్లా శేఖర్, శ్రీధర్, గంగరాజు, కొండా, పొడకలపల్లి శ్రీను, పాయం భద్రయ్య, పుష్పరాజు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్‌గాంధీ జోడో పాదయాత్రకు కార్యకర్తలు తరలిరావాలి

*దుమ్ముగూడెం, ప్రభాతవార్త :*

కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో పాదయాత్రకు కాంగ్రెస్ శ్రేణులు కదిలి రావాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు లంకా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని లక్ష్మీనగరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ జోడో పాదయాత్ర వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లంకా శ్రీనివాసరావు మాట్లాడుతూ .. భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఆదేశాల మేరకు దుమ్ముగూడెం మండల ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించామని, రాహుల్‌గాంధీ తెలంగాణలో చేపట్టే జోడో పాదయాత్రకు కార్యకర్తలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. బిజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు జోడో పాదయాత్రలో కార్యకర్తలు



పాల్గొనాలని, దేశంలో పెరుగుతున్న రాజకీయ ఆర్థిక అసమానతలను తొలగించడం కోసం రాహుల్‌గాంధీ భారత్‌జోడో యాత్ర చేపట్టారని, ఈ యాత్ర దేశంలోనే చారిత్రాత్మకంగా సువర్ణఅక్షరాలతో లిఖించబడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బైరెడ్డి సీతారామారావు, సీరపు అప్పలరెడ్డి, పిలకా వెంకటరమణారెడ్డి, లంకా శివకుమార్, కంగాల వెంకటేష్, కనుబుద్ది దేవా, తదితరులు పాల్గొన్నారు.




## గర్భిణీ స్త్రీలకు తలసేమియా రక్త పరీక్షలు

*మధిర, అక్టోబర్ 27, ప్రభాతవార్త :*



మాటూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డా॥ వెంకటేష్ ఆద్వర్యంలో గురువారం గర్భిణీ స్త్రీలకు తలసేమియా రక్త పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శిబిరంలో గుర్తించిన గర్భిణీ స్త్రీలకు రక్త పరీక్షలు చేశారు. గర్భిణీ స్త్రీలకు జన్యు సంబంధమైన అనారోగ్యాలపై ముఖ్యంగా తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియాపై, నార్మల్ డెలివరీ అవటం కోసం తీసుకోవాల్సిన పోషకాహారపు అలవాట్లు, శారీరక శ్రమ, నడక, చిన్న చిన్న వ్యాయామాలపై ఆరోగ్య అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షణ అధికారులు భాస్కర్‌రావు, శరత్‌బాబు, సుభాషిని, స్టాప్ నర్స్ మర్తమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ పుతిలి భాయ్, ఏఎన్ఎం శోభ, మరియమ్మ, ఆశా కార్యకర్తలు, డీఈవో కిరణ్ పాల్గొన్నారు.

## మా ఎమ్మెల్యేలు ప్రలోభాలకు లొంగేవారు కాదు

### మోడీ దిష్టిబొమ్మ దహనం



*మధిర, అక్టోబర్ 27, ప్రభాతవార్త :*

టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురి చేసే బీజేపీ నాయకుల్లారా ఖబడ్దార్ అంటూ టీఆర్ఎస్ శ్రేణులు నిరసన తెలియజేస్తూ గురువారం అంబేద్కర్ సెంటర్‌లో ప్రధాని నరేంద్రమోడీ దిష్టిబొమ్మ దగ్దం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో టీఆర్ఎస్ 20మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేసే నీచమైన ప్రక్రియకు బీజేపీ నాయకులు కుట్ర పన్నిన విధానాన్ని వ్యతిరేకిస్తూ టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు కనుమూరు వెంకటేశ్వరరావు ఆద్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు పార్టీ ప్రజా ప్రతినిదులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## పాల్వంచ ఎస్సైని అభినందించిన ఎస్పీ



*పాల్వంచ క్రైం, అక్టోబర్ 27 - ప్రభాతవార్త:*

జిల్లా వ్యాప్తంగా వర్టికల్స్ వారీగా ఉత్తమ ప్రతిభ కనపర్చిన పట్టణ ఎస్సై నరేష్‌ని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అభినందించారు. ప్రశంసా పత్రాన్ని అందించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సత్యనారాయణ, సీఐ నాగరాజులు ఎస్సైని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## జాతీ సమైఖ్యతకే భారత్ జోడో యాత్ర

*నర్సంపేట, అక్టోబర్ 27, ప్రభాతవార్త*

జాతీ సమైఖ్యతకు భారత్ జూడో యాత్ర నిర్వహిస్తున్నట్లు మాజీ వరంగల్ పార్లమెంట్ సభ్యులు సిరిసిల్ల రాజయ్య అన్నారు. గురువారం జూడో యాత్ర గుర్తింపు కార్డులను కాంగ్రెస్ నాయకులకు అందజేశారు. వారం రోజుల పాటు జూడో యాత్రలో పాల్గొనుటకు నియోజకవర్గానికి చెందిన తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, ఓర్సు తిరుపతి, వేముల సాంబయ్య, కర్నాటి పార్వతమ్మ, బొంత మురళి, గొర్రె నవీన్, లక్ష్మణ్, గుర్తింపు కార్డులను అందజేశారు.




## శ్రీరాగా స్కూల్‌లో విద్యార్థులకు మోటివేషన్ తరగతులు

*కొత్తగూడెం మున్సిపాలిటీ, అక్టోబర్ 27 - ప్రభాతవార్త:*



మున్సిపాలిటీ పరిధిలోని మేదరబస్తీలో ఉన్న శ్రీ రాగా స్కూల్‌లో గురువారం హైస్కూల్ విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ తరగతులకు స్పీకర్‌గా ఎంటెక్ పీహెచ్‌డీ చేస్తూ ఈ ఫీల్డ్ ఎంచుకున్న శిరీష పాల్గొని విద్యార్థులు పలు అంశాలను వివరించారు. హైదరాబాద్‌లోని శ్రీరామకృష్ణ మఠంలో సుమారు రెండు సంవత్సరాలుగా మోటివేషన్ స్పీకర్‌గా ట్రైనింగ్‌లో సర్టిఫికెట్ కోర్సును ముగించారు. ఈ2 సందర్భంగా విద్యార్థులకు ఆలోచనను, వారి ప్రవర్తనలో ప్రతీ పనిని విలువలు జోడిస్తూ చేస్తే సెల్ఫ్ సాటిస్ఫాక్షన్‌తో మానసిక ప్రశాంతత వస్తుందని అన్నారు. తద్వారా చదువుల్లో, జీవితాల్లో వెలుగులు నింపుతు కొంతూఐనా మార్పు తీసుకురావడమే నా లక్ష్యం అని అన్నారు. ఈ సందర్భంగా ఆమెను సన్మానించారు. కరస్పాండెంట్ మల్లా రపు వరప్రసాద్, ఉపాధ్యాయులు రాంబాబు, సర్వేశ్వరరావు, వాసు, సంధ్య పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

*ములకలపల్లి, అక్టోబర్ 27 ప్రభాతవార్త :*



టీపీటీఎఫ్ పిలుపుమేరకు గురువారం ప్రభుత్వ గిరిజన ఉన్నత పాఠశాల కమలాపురంలో ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. తక్షణమే కన్వర్టడ్ ఆశ్రమ పాఠశాలలో పోస్టులు మంజూరు చేసి భర్తీచేయాలని, ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు తక్షణమే నిర్వహించాలని, ఆశ్రమ పాఠశాలల్లో పండిట్, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులను ఉన్నతీకరించి వారికి పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, వారికి 12 నెలల జీతాలు చెల్లించాలని, గిరిజన సంక్షేమశాఖలో ఉద్యోగుల నిష్పత్తి ఆధారంగా ఉపాధ్యాయులకు ఏటీడీవో, డీటీడీవో పదోన్నతులు కల్పించాలని, అన్ని ఆశ్రమ పాఠశాలల్లో ప్రత్యేక సంక్షేమ అధికారులను నియమించాలని, డైలీవేజ్ వర్కర్లను రెగ్యులర్ చేయాలని, ప్రతి పాఠశాలకు ఏఎన్ఎం పోస్టులు మంజూరు చేయాలని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బస్టాండ్‌లో 32 కేజీల గంజాయి స్వాధీనం

*కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 27 - ప్రభాతవార్త:*




జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్‌లో వన్‌టౌన్ పోలీసులు 32 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నలుగురు ఛత్తీస్‌గఢ్ వాసులని అదుపులోకి తీసుకున్నారు. భద్రాచలం నుంచి కరీంనగర్ వెళ్లే బస్సులోద ఆడులు నిర్వహించగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో కోవాసి సన్ను, కోవాసి బూత్‌రాం, కోవాసి సహదేవ్, సునిల్‌లు ఛత్తీస్‌గడ్ రాష్ట్రం దంతెవాడ జిల్లా నుంచి వస్తున్నారు.

# రైల్వేస్టేషన్‌లో మిల్లెట్స్ ప్లాజా ప్రారంభం

*కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 27 - ప్రభాతవార్త:*

సేంద్రీయ ఉత్పత్తులను రైల్వే ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సతీస్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం రైల్వేశాఖలో ఇటీవల వన్ స్టేషన్ - వన్ ప్రొడక్ట్ అనే స్కీంలో భాగంగా స్థానిక రైల్వే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సుగుణ మిల్లెట్స్ ప్లాజాని గురువారం రాత్రి స్టేషన్ అధికారులు, ప్రకృతి ప్రేమికులు పాల్గొని ప్రారంభించారు. రసాయనాల ద్వారా పండించిన ఆహార పదార్థాలను తినడం వల్ల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని, దానికి పరిష్కారం రసాయనరహితంగా సేంద్రీయ పద్ధతిలో పండించిన పంటలను, రైల్వే ప్రయాణీకులకు అందించే ఉద్దేశంతో ఈ స్కీంను ప్రారంభించినట్లు వెల్లడించారు. స్టాల్‌ని మాస్టర్ ఈకే హోమియో డిస్పెన్సరీ నిర్వాహకులు గోపాలరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.



ఈకార్యక్రమంలో ఆన్‌డ్యూటీ స్టేషన్ మాస్టర్ ఎస్‌వైకే పాషా, జీఆర్ పీఎఫ్, ఆర్‌పీఎఫ్, రైల్వే సిబ్బంది, మున్సిపల్ గ్రీన్ అంబాసిడర్ మొక్కల వెంకటయ్య, లక్ష్మీ, స్టాల్ నిర్వాహకులు సుగుణా రావు, శోభారాణి, ప్రకృతి ప్రేమికులు ముస్తఫా, దయా సాగర్, మల్లయ్యా, బన్‌గీ సాహెబ్, శ్రీవాత్సవ, సుధీర్, చంద్రమౌళి, జీవన్, నాగమౌళి పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని గిరిజనులకు అప్పగించాలి : ఆదివాసీ జేఏసీ డిమాండ్

*ములకలపల్లి, అక్టోబర్ 27 ప్రభాతవార్త:*

మండల పరిధిలోని సీతారాంపురంలో సర్వేనెంబర్ 241లోని 63 ఎకరాల భూమి పాల్వంచకు చెందిన కొందరు ప్రభుత్వ ఉద్యోగుల చేతిలో ఉందని, ఆ భూమిని రెవెన్యూ అధికారులు నిష్పక్షపాతంగా సర్వే జరిపించి పేద గిరిజనులకు ఇళ్ల స్థలాలకు కేటాయించాలని ఆదివాసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ములకలపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ సర్వేలో ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా చూపుతూ కొందరు గిరిజనేతరులు వారిపేరు మీద ఉన్న పట్టా భూమి ఇది కాదని, ప్రస్తుతం వారు అనుభవిస్తున్న భూమి ప్రభుత్వ భూమి అని నిర్ధారణ చేశారని ఆరోపించారు. ఇందులో భాగంగా పేదగిరిజనులు గుడిసెలు వేసుకునేందుకు వెళ్లగా స్థానిక పోలీసులు ఆదివాసీలపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు.



ఉన్నతాధికారులు వెంటనే స్పందించి గిరిజనేతరుల స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ భూమిని నిరు పేదలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆదివాసీ జేఏసీ నాయకులు ఊకే ముక్తేశ్వరరావు, సోయం బాబూరావు, సోయం సత్యనారాయణ, బాడిస భిక్షం, ఆర్ఎం ప్రశాంత్, కుర్సం రమేష్, కుంజా రవి, బండి ధర్మరాజు, కోండ్రు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# జనావాసాల్లోకి కొండచిలువ




*చుంచుపల్లి, అక్టోబర్ 27 - ప్రభాతవార్త:*

మండలంలోని నందాతండా పల్లె ప్రకృతి వనంలో గురువారం రాత్రి సంచరిస్తున్న కొండ చిలువను స్నేక్ రెస్క్యూ టీం సభ్యులు పట్టుకున్నారు. పార్కులో లైట్లు లేకపోవడంతో చిమ్మని చీకటిలో అతి పెద్ద కష్టం మీద టీమ్ ఆ కొండ చిలువను పట్టుకున్నారు. దీంతో గ్రామస్తుల మనస్సు నెమ్మదించింది. టీమ్ లీడర్ దద్దు మాట్లాడుతూ... కొండ చిలువలు ఆసియా దేశాలైన పాకిస్తాన్, భారతదేశం, శ్రీలంక, నికోబార్ దీవులు, మయన్మార్, చైనా దక్షిన ప్రాంతం, హాంకాంగ్, ఇండోనేషియా, ఫిలిప్పైన్స్‌లలో కనిపిస్తాయని, ఎక్కువగా అడవుల్లో నివసిస్తూ జంతువులను మించి వాటి ఆకలిని తీర్చుకుంటాయన్నారు. కొన్నిసార్లు మనుషులను కూడా చంపిన, మింగిన సందర్భాలు ఉన్నాయన్నారు. పాములు కనిపిస్తే భయపడకుండా ముందుగా తమకు 9052279147 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో దద్దు, పెద్దిరాజు, టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

## నేటి నుంచి రాష్ట్రస్థాయి జూనియర్ వాలీబాల్ పోటీలు ప్రారంభం

*కొత్తగూడెం, అక్టోబర్ 27 - ప్రభాతవార్త:*

తెలంగాణ ఏడవ రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల వాలీబాల్ క్రీడా పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినం సందర్భంగా 28, 29, 30, 31 తేదీల్లో స్థానిక ప్రకాశం స్టేడియంలో నాలుగు రోజుల పాటు వాలీబాల్ పోటీ నర్విహించడం జరుగుతుందని, దీనికి పూర్తిస్థాయిలో శ్రీనివాసరెడ్డి సహాయ సహకారాలతో తెలంగాణ వాలీబాల్ అసోసియేషన్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఉమ్మడి ఖమ్మం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జరుగుతున్న ఏర్పాట్లను జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఊకంటి గోపాలరావు, తంబూరు దయాకర్‌రెడ్డి, తుళ్లూరి బ్రహ్మయ్య, నాగేంద్ర త్రివేది, జారెఆదినారాయణ, ఆళ్ల మురళి, తూము చౌదరి, టీబీజీకేఎస్ నాయకులు సోమిరెడ్డి, ఎండీ రజాక్, తాండ్ర నాగబాబు, చీకటి కార్తీక్, దుర్గ, సతీస్, కలకోటి రాజు, జక్కపల్లి ప్రసాద్, నిరంజన్, గౌస్, బన్నీ, ప్రేమ్‌లు పాల్గొన్నారు.



# శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించవద్దు

**- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు**

**- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ వినీత్**

*కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 27 - ప్రభాతవార్త:*



జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించేది లేదని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో గురువారం జరిగిన నెలవారి నేర సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ... శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ మరలా ఏదైనా నేరానికి పాల్పడితే వారిపై పీడీయాక్టు కేసులను నమోదు చేయాలని సూచించారు. మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్ లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతర నిఘా ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. నిషేదిత గంజాయి అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చర్యలు చేపట్టాలన్నారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేయాలని, మద్యం సేవించి నిర్లక్ష్యంగా వాహనాలు నడిపే వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి అట్టి వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా వర్టికల్స్ వారీగా ఉత్తమ ప్రతిభ కనపర్చిన పోలీసు అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ రోహిత్‌రాజు, కొత్తగూడెం డీఎస్పీ వెంకటేశ్వరబాబు, ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తి, మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు, డీసీఆర్‌బీ సీఐ ఉపేందర్, సీఐలు, ఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.








## మైనార్టీ స్కాలర్‌షిప్ పొందేందుకు ఉచిత ఆన్‌లైన్ క్యాంప్

*కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 27 - ప్రభాతవార్త:*



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పలు స్కాలర్‌షిప్‌లు పొందడానికి గాను జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని ఎంజీరోడ్‌లో ఉన్న ముస్లిం ఉర్దూఘర్ కం షాదీఖానాలో ఈ నెల 30వ తేదీన ఉదయం 9 గంటలకు ఉచిత ఆన్‌లైన్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు మైనార్టీ జిల్లా అధ్యక్షుడు యాకూబ్‌పాషా గురువారం ఒక ప్రకటనలో తలెఇపారు. కేంద్ర మైనార్టీ మంత్రిత్వ శాఖ అందిస్తున్న ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్, మెరిట్ కం మీన్స్, బేగం హజరత్ మహల్, ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ డిప్లమా, ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థుళకు అందిస్తున్న స్కాలం౯షిప్‌లతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఈ పాస్ ద్వారా అందిస్తున్న స్కాలర్ షిప్‌లకు కూడా ఉచితంగా ఆన్‌లైన్ చేయడం జరుగుతుందని అన్నారు. మరింత సమాచారం కోసం 8886934260, 8520860785 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

## మహిళలకు స్వయం ఉపాధిరంగంపై ప్రోత్సహించడం అభినందనీయం

*కొత్తగూడెం, అక్టోబర్ 27 - ప్రభాతవార్త:*




మహిళలను స్వయం ఉపాధిరంగం వైపు ప్రోత్సహించి ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా కేవీఎం ట్రస్టు కృషి చేయడం అభినందనీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మిలు అన్నారు. రామవరం పంజాబ్‌గడ్డ ఏరియాలో 8వ వార్డులో కంచర్ల విజయవాణి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరు నెలల ఉచిత కుట్టు శిక్షణను పూర్తి చేసుకున్న మహిళలకు గురువారం ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టు మిషన్లు అందించారు. కేవీఎం ట్రస్టు నిర్వహిస్తున్న స్వయం ఉపాధి శిక్షణలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంచర్ల జమలయ్య, సివిల్ ఏజీఎం సూర్యనారాయణ, లైజన్ ఆఫీసర్ కలవల చంద్రశేఖర్, హిమజ ట్రస్టు నిర్వాహకులు ఊకంటి గోపాలరావు, ఎఫ్ఐ ఫస్ట్ వైస్ జిల్లా గవర్నర్ శివప్రసాద్, రాష్ట్ర మైఆనీరటన సంఘం నాయకులు ఎంఏ నయీం ఖురేషి, మిలీనియం కొత్తగూడెం కార్యదర్శి రాజేశ్వరరావు, జేబీ మోహన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## విస్తృత ప్రచారంలో లీనమైన టీపీసీసీ మెంబర్ ఎడవల్లి

*కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 27 - ప్రభాతవార్త:*



మునుగోడు నియోజకవర్గం మర్రిగూడ మండలం శివన్నగూడెంలో ఇంచార్జి టీపీసీసీ మెంబర్ ఎడవల్లి కృష్ణ ఆధ్వర్యంలో పాల్వాయి స్రవంతి గెలుపు కోసం విస్తృత ప్రచారంలో లీనమై చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు ఎడవల్లి కృష్ణ ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లి ప్రచారం చేశారు. ఏ ఇంటికి ప్రచారం వెళ్లినా అక్క చెల్లెలు, అన్న తమ్ముళ్లు, తాతా, అమ్మమ్మలు కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటు వేస్తామని, స్రవంతిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని, టీఆర్ఎస్, బీజేపీలకు గుణపాఠం చెప్తామని ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్వేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వజ్రమ్మ, ఆనందరావు, చిలుకూరి యాదయ్య, నరసింహాగౌడ్, వరికుప్పల ఎల్లయ్య, కట్టా రామస్వామి,. కొత్తగూడెం నుంచి రాయల శాంతయ్య, బొమ్మిడి మల్లికార్జున్, సిరంగి శ్రీనివాస్, కొప్పుల రమేష్, అరికల కరుణాకర్‌లు పాల్గొన్నారు.

## సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపికలు

*కొత్తగూడెం స్పోర్ట్స్, అక్టోబర్ 27 - ప్రభాతవార్త:*

జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ సాఫ్‌టబాల్ జిల్లా ఎంపికలు సెయింట్ జేవియర్స్ హైస్కూల్‌లో నిర్వహఙంచారు. ఫాదర్ ఆనంద్ , జాస్మిన్ సిస్టర్‌లు పాల్గొని పోటీలను ప్రారంభించారు. క్రీడలు ఆడటం వల్ల మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చని, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించవచ్చని అన్నారు. వచ్చే నెలలోజరగబోయే రాష్ట్రస్థాయి పంపించడం జరుగుతుందని జిల్లా కార్యదర్శి నవీన్‌కుమార్ తెలిపారు. సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఆర్గనైజర్ సెక్రటరీ సాయితేజ, కోచ్ పృద్వీరాజ్, సీనియర్ ప్లేయర్ కౌశిక్, పీఈటీలు బద్రిలాల్, లక్ష్మీనారాయణ, రమేష్, కవిత, స్వాతి ప్రియ, శోభన్‌లు పాల్గొన్నారు.



## మాలమహానాడు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

*కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 27 - ప్రభాతవార్త:*

పట్టణంలోని పోస్టాఫీస్ సెంటర్‌లో మాలమహానాడు ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పూల రవీందర్ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాలమహానాడు జెండాను ఎగురవేశారు. తమ సంఘం మరింత బలపడటానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుడివాడ రాము, రామచంద్ర, కలవల నగేష్, దారా వరుణ్, పగిడిపల్లి శ్రీకాంత్, స్వామి, భూపతి అశోక్, సొల్లు, రవి కిరణ్, బాల, చక్రధర్‌లు పాల్గొన్నారు.



## విద్యార్థులకు వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోటుపుస్తకాలు పంపిణీ

*ములకలపల్లి, అక్టోబర్ 27 ప్రభాతవార్త :*



మండల పరిధిలోని జగన్నాధపురం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నోటు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అందజేసిన పుస్తకాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు అందజేశారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, గడ్డం కుమార్, సంస్థ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టీఆర్ఎస్ ఆధ్వర్యంలో కేంద్రం దిష్టిబొమ్మ దగ్ధం

*జూలూరుపాడు, అక్టోబర్ 27 - ప్రభాతవార్త:*

సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, వైరా ఎమ్మెల్యే రాములు నాయక్, ఎమ్మెల్సీ తాతా మధుల ఆదేశాల మేరకు తెలంగాణలో బీజేపీ తెలంగాణ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి కుట్రలకు వ్యతిరేకంగా మండల కేంద్రంలో టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చౌడం నరసింహారావు ఆధ్వర్యంలో కేంద్రం దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్యా సోనీ, లేళ్ల వెంకటరెడ్డి, యల్లంకి సత్యనారాయణ, యదళ్లపల్లి వీరభద్రం, నున్నా రంగారావు, సర్పంచ్ లావుడ్యా కిషన్ లాల్, దుద్దుకూరి మధుసూధన్‌రావు, పెండ్యాల రాజశేఖర్, మోదుగు రామకృష్ణ, రాంశెట్టి రాంబాబు, దొండపాటి వాసులు పాల్గొన్నారు.



# విచారణకే పరిమితమా.?

**- బియ్యం మాయం ఇక మిస్టరీయేనా..**

**- కాంట్రాక్టర్‌పై 6ఏ నమోదైనా చర్యలు శూన్యం...**

**- 'గురుకులం' బియ్యం మాయంలో అందరూ దొంగలేనా...**



పాల్వంచ, ప్రభాతవార్త:

"ఏదైనా సంఘటన జరిగిందంటే.. వెంటనే సంబంధిత శాఖల అధికారులు వచ్చి ఆ విషయంపై పూర్తి విచారణ చేస్తారు.. అసలు ఆ సంఘటన జరగడానికి కారణాలు... ఎవరి వల్ల జరిగింది... తప్పిదం ఎక్కడ జరిగింది... అసలు కారకులెవరు... ఇది ఎప్పటి నుంచి జరుగుతోంది... తాజాగా జరిగిందా.. లేక ఎప్పుడూ జరుగుతుందా... అనుమతులు ఉన్నాయా లేవా... అనధికారికంగానే మొత్తం తతంగం నడుస్తోందా... దోషులు ఎవరూ... కారకులు ఎవరూ... దీని వెనుక ఎవరి హస్తం ఉంది..." అంటూ ఇలా అన్ని కోణాల్లో విచారణ జరిపిన తరువాత బాధ్యులను శిక్షిస్తారు.. కానీ ఇక్కడ మాత్రం సీన్ రివర్స్ అయిపోయిందనే చెప్పాలి. సుమారు మూడు నెలలు కావస్తున్నా బియ్యం మాయం చేసిన వారు ఎవరో కళ్లకు కట్టినట్లు తెలిసినా... కానీ అధికారులు మాత్రం చర్యలు తీసుకునేందుకు వెనుకంజ వేస్తున్నారు... అంటూ ఈ కుంభకోణంలో అందరూ దొంగలు అన్నట్లు తేటతెల్లం అవుతోంది. కిందిస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతస్థాయి, విచారణ అధికారులు కూడా ముడుపులు తీసుకొని ఈ విషయాన్ని ఇంతటితో సమాప్తి చేసి శుభం కార్డు వేసినట్లు ప్రజలు చెప్పుకుంటున్నారు. విచారణ లోతుగా చేస్తున్నాం... మా పని మేం చేస్తున్నాం... ఉన్నతాధికారులు నివేదికలుఇచ్చాం... అంతా వారే చూసుకుంటారు... అంటూ విచారణకు వచ్చిన దాటవేశారు. అయితే అసలు రిపోర్టులో విచారణ చేసిన అంశాలు ఏమేమి పొందుపర్చారో కూడా తెలియదు. వాస్తవాలను కప్పి పెట్టి అవాస్తవాలను.. అసలు అక్కడ ఏం జరగలేదని వీళ్లు రిపోర్టు ఇచ్చారో ఏమో కానీ ఉన్నతాధికారులు కూడా నిమ్మకు నీరెత్తినట్లే ఉండటం పలు అనుమానాలకు దారితీస్తోంది.

**- బియ్యం మాయం ఇక మిస్టరీయేనా..**

రేషన్ బియ్యం... దొడ్డుబియ్యం తరలి వెళ్తుంటే దాడిచేసి మరి పట్టుకునే సివిల్ సప్లై, సంబంధిత శాఖల అధికారులు గురుకులంలో సన్నబియ్యం సిబ్బంది ఇళ్లకు చేరుతున్నట్లు దాడులు చేసి పట్టుకున్నా కానీ ఎలాంటి యాక్షన్ తీసుకోకపోవడంతో ఇక బియ్యం మాయం వ్యవహారం మిస్టరీగానే మిగిలిపోతుందని పలువురు చెప్తున్నారు. పిల్లల నోటికాడ కూడు లాక్కొని దాన్ని బయటికి పంపిస్తున్న గురుకులం పందికొక్కుపై చర్యలు తీసుకోవడంలో అధికారులు వెనుకంజ వేస్తున్నారు. అంటే అసలు దొంగను రక్షించేందుకు అధికారులు నానా తంటాలు పడుతున్నారు. అంతలా తన పలుకుబడిని ఉపయోగించుకొని తన హవా కొనసాగిస్తున్నట్లు పలువురు చెప్తున్నారు. దొరికితే దొంగ... దొరక్క పోతే దొర... అన్న సామెత మనం వినే ఉంటాం... కానీ ఇక్కడ మాత్రం దొరికినా... దొరక్క పోయినా దొరే అవుతున్నాడు. ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టుకోలేడంటూ చెప్పిన మాట మాత్రం ఇక్కడ నిజమవుతోంది.

**- బియ్యం మాయంలో అందరూ దొంగలేనా...**

పాల్వంచలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో జరిగిన బియ్యం మిస్టరీని అధికారులు పూర్తిగా చేదించలేకపోయారని అనిపిస్తోంది. దీనికి సంబంధించిన కాంట్రాక్టర్‌పై 6ఏ కేసు నమోదైనా ఎటువంటి చర్యలు తీసుకోకుండా అతని కొనసాగించడం, బినామీ కాంట్రాక్టర్‌కి ప్రతీకగా ఎవరు నడిపిస్తున్నారు... తనకు తాను సవనయగా అంగీకరించినా అధికారులు మాత్రం విచారణ జరిపి ఎందుకు అలసత్వం చేస్తున్నారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. పిల్లలకు అందాల్సిన సన్నబియ్యం సిబ్బంది ఇళ్లకు ఎలా చేరుతోంది... అంటే పిల్లలకు కడుపునిండా భోజనం పెట్టట్లేరా... పిల్లలకు పెట్టాల్సిన బియ్యాన్ని సిబ్బంది ఎలా బయటికి తీసుకెళ్తున్నారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎవరికి తెలియకుండా అసలు ప్రిన్సిపాల్‌కు తెలియకుండా సిబ్బంది తమంతట తామే తీసుకెళ్లే వీలుండదు. కానీఈ బియ్యం తమకు ప్రిన్సిపాల్ సార్ ఇచ్చారంటూ వంటసిబ్బంది చెప్పడం కొసమెరుపు. కానీ అధికారులు మాత్రం పూర్తి విచారణ జరిపి నివేదికలు సమర్పించినా అందులో పొందుపర్చిన అంశాలను పరిశీలించి కూడా అసలు దొంగను పట్టుకోవడంతో ఎందుకు తాత్సారం చేస్తున్నారో తెలియడం లేదు. అంటే ఈ బియ్యం మాయంలో అందరూ దొంగలుగా మారారనే తెలుస్తోంది. ఒకరు చేసిన తప్పిదాన్ని కప్పి పుచ్చుకోవడానికి లక్షల్లో ముడుపులు తీసుకున్నట్లు అవగతమవుతోంది. ఏది ఏమైనా ప్రభుత్వ వసతి గృహంలో ఇంత దారుణం జరుగుతున్నా అడ్డుకునే వారే లేరా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.



## ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన అధికారులు

భద్రాచలం, ప్రభాతవార్త :

గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమం పాఠశాలల మరియు ప్రాథమిక పాఠశాలలో పరిశీలన కోసం వచ్చిన బృందం రాజుపేటలోని గిరిజనుల సంక్షేమ శాఖ ప్రాథమిక పాఠశాలను పరిశీలించడం జరిగిందని, సంబందిత కాకతీయ గవర్నెన్స్ ఫెలో శ్రావణి, వై.ఎస్.డీ.సుధాకర్ అన్నారు. గురువారం భద్రాచలంలో ఐటిడిఏ పీవోను కలిసిన అనంతరం రాజుపేల కాలనీలోని జీపీఎస్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి గిరిజన విద్యార్థుల కొరకు ప్రభుత్వం అనేక రకాల సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందని, దానికి అనుగుణంగా గిరిజన చిన్నారులు ఎటువంటి భయం పడకుండా జరిగిందని, దానికి అనుగుణంగా గిరిజన చిన్నారులు ఎటువంటి భయం పడకుండా చదువుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పీఎంఆర్‌సీ ఏసీఎంవో రమణయ్య, జీసీడీవో అలివేలు మంగతాయారు, పాఠశాల హెచ్‌ఎం గోవిందనాయక్, తదితరులు పాల్గొన్నారు.

## కార్తీకమాసం సందర్భంగా కాలినడకన రాముని దర్శించుకునేందుకు వెళ్లిన భక్తులు

చంద్రుగొండ, అక్టోబర్ 27 - ప్రభాతవార్త:



కార్తీకమాసం సందర్భంగా చంద్రుగొండ మండలంలోని దామరచర్ల గ్రామం హనుమాన్ ఛాలీసా భక్త బృందం ఆధ్వర్యంలో గురువారం గ్రామంలోనే రామాలయం నుంచి భద్రాచలం రాముని దర్శించుకునేందుకు మహిళా భక్తులు కాలినడకన బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామంలోనే ఉన్న ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని పాడిపంటలు పశువులు చల్లగా ఉండాలని పూజలు చేసి మొక్కులు తీర్చుకునేందుకు వెళ్తున్నట్లు తెలిపారు. శుక్రవారం భద్రాచలం రాములోరిని దర్శించుకునేందుకు ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు భక్తబృందం తెలిపారు.

## ఈ ఏడాది నుంచి వైద్య తరగతులు ప్రారంభం: కలెక్టర్

కొత్తగూడెం, అక్టోబర్ 27 - ప్రభాతవార్త:

ఈ విద్యాసంవత్సరం నుంచి వైద్య తరగతులు ప్రారంభం కానున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ తెలిపారు. గురువారం జాతీయ మెడికల్ కౌన్సిల్ ద్వారా వైద్య కళాశాలకు కేటాయించిన విద్యార్థులకు కలెక్టర్ అడ్మిషన్ పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేరళ రాష్ట్రానికి చెందని శ్రేయా నాయర్ అనే విద్యార్థిని వైద్య కళాశాలలో అడ్మిషన్ తీసుకున్నారని, అట్టి విద్యార్థి నేడు కళాశాలలో జాయిన్ కావడానికి వచ్చిన సందర్భంగా ఆమెకు అడ్మిషన్ పత్రాన్ని అందించినట్లు చెప్పారు. నవంబర్ 15 నుంచి వైద్య తరగతులు ప్రారంభం కానున్నట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర కోటాలో 150 మంది విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించడానికి అవకాశం ఉందని అనానరు. వైద్య కళాశాల భవనాన్ని యుద్ధ ప్రాతిపదికన నిర్మించిన రహదారుల భవనాల శాఖ అధికారులను, వైద్య కళాశాల సిబ్బందిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ భీమ్లా, డీఎంఈ ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు, సూపరింటెండెంట్ డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

## నేడు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

**-ఈ నెల 28,29,30 తేదీలలో క్రీడలు**

స్తంభాద్రి, అక్టోబర్ 27 ప్రభాతవార్త:

ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర టీఆర్ఎస్ నాయకులు, ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కబడ్డీ పోటీలు ప్రారంభం కానున్నాయి. పొంగులేటి శీనన్న జన్మదిన వేడుకగా తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అనుమతితో ఖమ్మం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28,29,30 తేదీలలో పోటీలు జరుగుతాయి. పొంగులేటి శ్రీనివాసరెడ్డి కబడ్డీ చాంపియన్‌షిప్ ట్రోపిలో భాగంగా పురుషులు, మహిళలకు ఈ పోటీలు ఏర్పాటు చేసిన ప్రకారం నిర్ధేశించిన సమయానికి ఆహ్వానిత జట్లు మాత్రమే ప్రవేశానికి అర్హులుగా పరిగణిస్తారు. ప్రథమ బహుమతి రూ.1 లక్ష, ట్రోపి,ద్వితీయ బహుమతి రూ.75వేలు, తృతీయ బహుమతి రూ.50వేలు,నాలుగవ బహుమతి రూ.40వేలు, ఐదవ బహుమతి రూ.30వేలు, ఆరవ బహుమతి రూ.20వేలు, ఏడవ బహుమతి రూ.15వేలు, ఏనిమిదవ బహుమతి రూ.10వేల చొప్పున క్రీడల్లో పాల్గొన్న విజేతలైన క్రీడాకారులకు అందజేస్తారు. పొంగులేటి స్వరాజ్యం, రాఘవరెడ్డి(పీఎస్ఆర్) ఛారిటబుల్ ట్రస్టు పేరిట నిర్వహించ తలపెట్టిన ఈ కబడ్డీ పోటీలలో క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూను సక్రమంగా పాటించాలి

**-ఎంపీపీ రేసులక్ష్మి**

దుమ్ముగూడెం, ప్రభాతవార్త :



ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాలని దుమ్ముగూడెం ఎంపీపీ రేసులక్ష్మి ఆశ్రమ పాఠశాల హెచ్.ఎం, ఉపాద్యాయులకు సూచించారు. మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలను గురువారం ఉదయం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు ఉదయం ప్రార్ధన సమయంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్ధిని, విద్యార్దులతో ఆమె మాట్లాడుతూ .. పాఠశాలలో సక్రమంగా మెనూ ప్రకారం ఆహారం అందుతుందా లేదా అని తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు నిత్యం పాఠశాలకు హాజరవుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి ఆమె తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల పనితీరుపై ఆమె సంతృప్తిని వ్యక్తం చేశారు. పాఠశాలను సక్రమంగా నడిపించుటకు కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు మడకం మోతీరును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పూసం ధర్మరాజు, టిఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి కణితి రాముడు, కారం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



# నిర్ధేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలి

**-వైద్య అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు**

*ఖమ్మం, అక్టోబర్ 27 ప్రభాతవార్త:*



జిల్లాలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులు నిర్ధేశించిన లక్ష్యాలను అన్ని పారామీటర్స్‌లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా లక్ష్యాలను కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వారి పరిధిలోని ప్రజలకు వైద్య, ఆరోగ్య సంబంధ సేవలు అందించాలని తెపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను పెంచాలని ఆయన అన్నారు. కొన్ని ప్రాథమకి ఆరోగ్య కేంద్రాల్లో జీవో ప్రసవాలు ఉన్నాయని, పనితీరు మెరుగుపడాలని, లేకుంటే చర్యలు తప్పవని ఆయన తెలిపారు. ఎఎన్ఎం, ఆశాలు తమ పరిధిలోని గర్భిణీల వివరాలను నమోదు చేయడంతో పాటు ప్రతి నెల క్రమం తప్పకుండా ఆసుపత్రికి వచ్చి పరీక్షలు చయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి నెల పిహెచ్‌సిలో 15కు మంచి ఇడిడి కేసులు ఉంటాయని, ప్రతి కేసు ఆయా పిహెచ్‌సికి వచ్చేలా అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి పిహెచ్‌సి పరిధిలో ఎన్ని కేసులు ప్రభుత్వ, ఎన్ని కేసులు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళుతున్నాయో నివేదిక సమర్పించాలని ఆయన అన్నారు. జిల్లాలో 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మరమ్మత్తులకు రూ.2.29 కోట్లు, బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పునర్ నిర్మాణానికి రూ.1.5 కోట్లు మంజూరు అయినట్లు ఆయన అన్నారు. ఇట్టి మొత్తంతో ఆసుపత్రికి, పేషంట్లకు ఉపయోగపడే పనలు చేపట్టాలని, ఈ పనుల పూర్తితో కేంద్రం స్పష్టమైన మార్పు రావాలని అన్నారు. డ్రైడే కార్యచరణ చేసి డెంగ్యూ కేసులు ఈ సంవత్సరం చాలా వరకు తగ్గించామని ఆయన తెలిపారు. టైఫాయిడ్ కేసులపై దృష్టి పెట్టాలని, ఇప్పటికే వసతి గృహ భోజన తయారు సిబ్బందికి పరీక్షలు చేసినట్లు, అదే విధంగా మధ్యాహ్న భోజన తయారు సిబ్బందికి, ఫాణిపూరి, మిర్చిబండ్లు, డాబాల్లోని ఆహార తయారీ వర్కర్లకు టైఫాయిడ్ పరీక్షలు నిర్వహించాలని, పాజిటివ్ కేసులు గుర్తించిన వాటిని చికిత్స అందించాలని ఆయన తెలిపారు. టిబి గుర్తింపుకు స్పుటం శాంపిల్ సేకరణ చేయాలని, గుర్తించిన ప్రతి కేసును వైద్యాధికారులు పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ తెలిపారు.




## ఇప్పటికి అందని ధూప దీప నైవేద్య అర్చకుల వేతనాలు

*ఖమ్మం, అక్టోబర్ 27 ప్రభాతవార్త:*



రాష్ట్ర దూపదీప నైవేద్య అర్చక సంఘం దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌ను సుమారు 500 మంది అర్చకులు గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఇంకా 280 మంది అర్చకులకు గౌరవ వేతనం అందటం లేదన్నారు. అసలే చాలి చాలని వేతనాలతో కుటుంబ జీవనాన్ని వెళ్లదీస్తున్న అర్చకులకు గోరుపై రోకటి పోటు మాదిరిగా ఈ వేతనాలు రాకపోవడం చాలా ఇబ్బంది కలిగిస్తుందని, కుటుంబ జీవనం రోజురోజుకు దిగజారిపోతున్నదని పలువురు అర్చకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై దేవాదాయశాఖ వెంటనే తగు నిర్ణయం ప్రకటించి అర్చకులకు వేతనాలు విడుదల చేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా దూప దీప నైవేద్యం అర్చక సంఘం అధ్యక్షులు మునిగేటి రమేష్ శర్మ, ప్రధాన కార్యదర్శి మరింగంటి భార్గవచారి, కోశాధికారి ప్రసాద్ శర్మలు తెలిపారు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

**-పార్టీ ఫిరాయింపులపై రెండు పార్టీలది ఒకే దారి**

**-టీఆర్ఎస్ మొదలు పెట్టింది.. బీజేపీ అనుసరిస్తోంది**

**-జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్**

*ప్రభాతవార్త ప్రత్యేక ప్రతినిధి,ఖమ్మం:*



అటు దేశంలో, ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, టీఆర్ఎస్ ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రజాస్వామ్యాన్ని నీరు గార్చే విధంగా వ్యవహరిస్తున్నాయని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మండిపడ్డారు. మొయినాబాద్ ఫాంహౌస్ సంఘటనపై గురువారం ఆయన నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ జావేద్‌తో కలిసి జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపులకు తెలంగాణ రాష్ట్ర సమితి ఆజ్యం పోస్తే, బీజేపీ దానిని అమలు పరుస్తోందని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యాన్ని, ప్రజా సమస్యలను గాలికి వదిలేసి రెండు పార్టీలు అధికారం కోసం అంపర్లాడుతున్నాయని మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం టీఆర్ఎస్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం బీజేపీపైఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రెండు ప్రభుత్వాలకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే మొయినాబాద్ ఫాంహౌస్ సంఘటనను సీబీసీఐడికి గాని, సిట్టింగ్ జడ్జితో గాని విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. అనంతరం నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ జావేద్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే గతంలో కేసీఆర్ కొన్న ఎమ్మెల్యేలపై ఇప్పుడు బేరం పెట్టిన ఎమ్మెల్యేలపై విచారణ చేయించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యడ్లపల్లి సంతోష్, రాష్ట్ర మైనార్టీ నాయకులు రబ్బాని, జిల్లా కాంగ్రెస్ నాయకులు మూడుముంతల గంగరాజు యాదవ్, మద్ది వీరారెడ్డి, కాంగ్రెస్ నాయకులు కోర్ని సీతారాములు, ఏలూరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మాతృశ్రీ ఉచిత మెగా క్యాంపు సక్సెస్

*వైద్య విభాగం, ప్రభాతవార్త అక్టోబర్ 27:*



మాతృశ్రీ సంతాన సాఫల్య కేంద్రం వారిచే సంతానం లేని దంపతులకు ఉచిత మెగా ఫెర్టి క్యాంపు న్యూలైఫ్ హస్పిటల్‌లో డాక్టర్ నీరజ ఆధ్వర్యంలో న్యూలైఫ్ మెటర్నిటీ హాస్పిటల్ ఇల్లందులో నిర్వహించడం జరిగింది. ఈ క్యాంపులో ఉచిత పరీక్షలు, మందులతో పాటు పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ సంస్థ చైర్మన్ డాక్టర్ వీరేశ్వర్ బండ్ల మాట్లాడుతూ.. ఎంతో మంది సంతానం లేని దంపతులకు ఇలాంటి సేవల ద్వారా సంతాన ప్రాప్తి పొందుతారని, తద్వారా వారి జీవితంలో మాతృత్వపు మాధుర్యం పొందుతారని ఆశిస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఇల్లందు పట్టణ ప్రజలకు డాక్టర్ నీరజ, డాక్టర్ స్వప్నలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సంస్థ మేనేజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంచుకొండలో సువార్త కూడికల ముగింపు

*రఘునాథపాలెం, అక్టోబర్ 27 ప్రభాతవార్త:*

రఘునాథపాలెం మండలం, మంచుకొండ సంత గ్రౌండ్ ప్రాంగణంలో యేసుక్రీస్తు సువార్త కూడికల ముగింపు వేడుకలు గురువారం ముగిశాయి. తొలుత యేసుక్రీస్తు సువార్త రోగుల స్వస్థత కొరకు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. భారీ సంఖ్యలో ప్రభు బిడ్డలు హాజరై దేవుని ఆశీర్వాదం పొందారు. ఈ కూడికల ద్వారా దేవుని వ్యాఖ్యలు విని సంతోషభరితులై ఆకర్షితులయ్యారు. ముఖ్య ప్రసంగీకులు పాస్టర్ ప్రభు నందు నిరీక్షణ ప్రార్ధన మందిరం తిమోతి, గాస్పల్ టీమ్ మినిస్ట్రీ వ్యవస్థాపకులు ఫాస్టర్ మందా తిమోతి, ఎన్‌సిపి తెలంగాణ రాష్ట్ర కమిటీ బాధ్యులు నేలాల బాలస్వామి బోధించారు. కార్యనిర్వాహకులు క్రీస్తు కృప ప్రార్థన మందిరం, కృష్ణ యువజన సంఘం వ్యవస్థాపకుడు బ్రదర్ మందా సంజీవరావు, పంగిడి పరిచర్య నిర్వాహకులు నాని రాజు ఆధ్వర్యంలో ప్రజల ఆశీర్వాదం సువార్త కోరికలను వివరించారు.



# నేడు విద్యుత్ ఉద్యోగుల చలో రాజధాని

**-బిల్లు సవరణకు వ్యతిరేకంగా తరలింపు**

**-ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలి**

**-కార్పొరేట్లకు దారాదత్తం చేస్తే సహించం**

**-తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ పిలుపు**

*రఘునాథపాలెం, అక్టోబర్ 27 ప్రభాతవార్త:*



కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు దారాదత్తం చేయటాన్ని విద్యుత్ ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీని వలన ఉద్యోగుల ఉనికికే ప్రమాదం ఏర్పడిందనే భావనలో ముందస్తుగా ఉద్యోగ సంఘాలు అప్రమత్తమయ్యారు. ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలను ప్రస్తుతం ఉన్న తరుణంలోనే కొనసాగించని ఎడల మొత్త వ్యవస్థకే నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. విద్యుత్ స్తంభం ఎక్కే కార్మికుల నుండి మొదలుకొని అధికారి స్థాయి వరకు సవరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మొత్తం వ్యవస్థలనే కార్పొరేట్ రంగాలకు కట్టబెట్టాలనే కుటిలయత్నాలను ఆదిలోనే ఎదుర్కొవాలనే లక్ష్యంతో తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జెఏసీ నేతలు శ్రీకారం చుట్టారు. మరోవైపు విద్యుత్ సంస్కరణల పెరిట ఎడా పెడా పెరుగుతున్న విద్యుత్ వినియోగదారుల ధరలను కూడా దృష్టిలో పెట్టుకొని సామాన్య ప్రజలు పడుతున్న ఇబ్బందులపై కార్పొరేట్లకు అప్పగిస్తే మరింత భారం పడే అవకాశం ఉంది. ఎలాగైనా విద్యుత్ సవరణ బిల్లును అడ్డుకోవాలనే లక్ష్యంతో 22 సంఘాలతో కూడిన జేఏసీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శుక్రవారం చలో రాజధాని ఉద్యోగుల తరలింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని ప్రతి ఇంట్లో ప్రతి ఒక్కరికి నిత్యంఅవసరమగు విద్యుత్‌ను కార్పొరేట్లకు కట్టబెట్టే ఆలోచన ఉపసంహరించుకునే వరకు పోరాటాల దిశగా జేఏసీ శ్రీకారం చుట్టింది. జేఏసీ ఆధ్వర్యంలో విడుదల చేసిన పోస్టర్‌ను వివరాలను పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సవరణ చర్యలను తిప్పికొడుతూ జరిగే కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ జేఏసీ నేతలు రత్నాకర్‌రావు, సాయిబాబా, శ్రీధర్ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం తలపెట్టిన కార్యక్రమ వివరాలను వివరించారు. రాజధానిలో జరిగే సదస్సుకు ఆల్ ఇండియా పవర్ ఇంజనీర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు శైలేంద్రదూబే, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ సెక్రటరీ జనరల్ మోహన్ శర్మ, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ పవర్ డిప్లమా ఇంజనీర్స్ అభిమన్యు ధన్‌కర్, అశోక్‌రావులతో పాటు వివిధ రైతు నాయకులు పాల్గొంటున్నారు. చలో విద్యుత్ ఉద్యోగుల రాజధాని సదస్సును విజయవంతం చేయాలని జేఏసీ నేత రత్నాకర్‌రావు కోరారు.




## కుట్రలతో మునుగోడులో గెలవలేరు

- బీజేపీకి చరమగీతం పాడేరోజులు వచ్చాయి
- మణుగూరు జడ్పీటీసీ పోశం నర్సింహారావు
- మణుగూరు మండల టీఆర్ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ

మణుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్27:

బీజేపీ ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం కూనీ అయ్యిందని, కుట్రలతో మునుగోడును గెలవలేరని మణుగూరు జడ్పీటీసీ పోశం నర్సింహారావు అన్నారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలుకు ప్రయత్నించి భంగపడ్డ బీజేపీకి మునుగోడు ఉప ఎన్నికల్లో ఓటమి తప్పదన్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేలను ప్రలోభాలకు



గురిచేయడాన్ని నిరశిస్తూ మణుగూరు పట్టణంలో గురువారం టీఆర్ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మణుగూరు అంబేద్కర్ కూడలి వద్ద టీఆర్ఎస్‌పార్టీ శ్రేణులు ధర్నా కార్యక్రమం చేపట్టారు. బీజేపీ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మణుగూరు జడ్పీటీసీ పోశం నర్సింహారావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ సారధ్యంలో అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వవిప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు పార్టీ ఆదేశాల మేరకే పనిచేస్తున్నారన్నారు. ఎన్నికుట్రలు పన్నినా మునుగోడులో బీజేపీకి స్థానం లేదన్నారు. బీజేపీ పాలనకు చరమగీతం పాడేరోజులు వచ్చాయన్నారు. తెలంగాణ రాష్ట్రప్రభుత్వంపై బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ విధానాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ విలువలకు తిలోదకాలిస్తూ తప్పుడు పద్ధతుల్లో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయాలని బీజేపీ దుర్మార్గపు చర్యలను తెలంగాణ ఎమ్మెల్యేలు ముక్తకంఠంతో తిప్పికొట్టడం పట్ల వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల, పట్టణ టీఆర్ఎస్‌పార్టీ అధ్యక్షులు ముత్యం బాబు, అడపా అప్పారావు, పీఏసీఎస్ అధ్యక్షులు కుర్రి నాగేశ్వరరావు, బొలిశెట్టి నవీన్, మండల, పట్టణ టీఆర్ఎస్‌పార్టీ నాయకులు తాళ్లపల్లి యాదగిరిగౌడ్, ప్రభుదాస్, ఆవుల నర్సింహారావు, ముద్దంగుల కృష్ణ, ఎడ్ల శ్రీనివాస్, బొశెట్టి రవి, గుర్రం సృజన్, కట్టా విజయ్‌కుమార్, బర్ల సురేష్, జావిద్‌పాషా, నకిని బాబూరావు, రమణయ్య, రమణ, బాబ్‌జానీ, రవి తదితరులు పాల్గొన్నారు.

## పండ్ల మొక్కలు పంపిణీ

మణుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్27:



సింగరేణి సంస్థ మణుగూరు ఏరియా ఆధ్వర్యంలో గురువారం మండలంలోని సీతానగరం గ్రామస్తులకు పలురకాల పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా పర్యావరణ అధికారి జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పెరట్లో పండ్ల మొక్కల పెంపకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జాగ్రత్తగా మొక్కలు పెంచి వాటిద్వారా వచ్చే ఫలాలను అందుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా వెల్ఫేర్ ఆఫీసర్ డి.నరేష్, నాసర్‌పాషా, కొప్పుల సీత, రావులపల్లి ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

అశ్వాపురం,అక్టోబర్27,ప్రభాతవార్త.



మునుగోడు ఉపఎన్నికలలో గెలిచేందుకు భారతీయ జనతా పార్టీ టీఆర్ఎస్ పార్టీ నలుగురు ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు డబ్బు ఎర చూపడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం మండలకేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ నేతృత్వంలో కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీకి తగిన గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. టీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు,మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉద్యోగుల సదస్సును జయప్రదం చేయాలి

- టీఎస్‌పీఈ జేఏసీ నాయకుల పిలుపు

మణుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్27:



విద్యుత్‌చట్ట సవరణ బిల్లును నిరశిస్తూ ఈ నెల 28న హైదరాబాద్ (ఖైరతాబాద్)లో ఇనిస్ట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ హాల్ నందు విద్యుత్ ఉద్యోగుల సదస్సును జయప్రదం చేయాలని టీఎస్‌పీఈ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. మణుగూరు బీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ కార్యాలయం ఎదుట గురువారం ఛలో హైద్రాబాద్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగుల సదస్సుకు ముఖ్య అతిథులుగా ఆలిండియా పవర్ ఇంజినీర్స్ ఫెడరేషన్ నాయకులు శైలేంద్రదూబే, అభిమన్యు ధన్‌కర్, మోహన్‌శర్మ, అశోక్‌రావుతో పాటు రాష్ట్ర జేఏసీ కన్వీనర్ రత్నాకర్, చైర్మన్ సాయిబాబాలు పాల్గొంటారని తెలిపారు. జేఏసీ కన్వీనర్ ఎస్.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ వి.ప్రసాద్, వైస్‌చైర్మన్ డి.సత్యనారాయణ, రవితేజ, పి.వీరాస్వామి, నరసింహ అల్లాపు తదితరులు పాల్గొన్నారు.

## విధుల్లో ఉత్తమ ప్రతిభకు ప్రశంసలు

మణుగూరు రూరల్,అక్టోబర్ 27 ప్రభాతవార్త:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ డాక్టర్.వినీత్‌జి జిల్లా సూపరింటెండెంట్ కార్యాలయంలో గురువారం ప్రశంసా పత్రాలు అందజేశారు. మెరుగైన శాంతిభద్రతల పరిరక్షణ,ఉత్తమ ప్రతిభ కనబర్చిన మణుగూరు సిఐ.ముత్యం రమేష్‌కు ఎస్పీ డాక్టర్.వినీత్‌జి చేతుల మీదుగా ప్రాంశంపత్రం అందుకున్నారు. మండల పరిధిలో నిషేధిత గంజాయి అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు,గుట్కా,పేకాట రాయుళ్ల ఆటలు కట్టు.. స్థావరాలపై దాడులు,చోరీ కేసులను తక్కువ కాలంలోనే కేసును ఛేదించడమే కాకుండా



ఏజెన్సీ గ్రామాల ప్రజలకు,యువతకు హెల్మెట్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం. అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా.. శాంతిభద్రతల పరిరక్షణ, ఉత్తమ సేవలు అందిస్తున్నందుకుగాను మణుగూరు సిఐ.ముత్యం రమేష్‌కు ఉత్తమ ప్రతిభకు ప్రశంసలు అందుకున్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ

మణుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్27:

మణుగూరు ఆర్టీసీడిపో ఉద్యోగులకు గురువారం ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. డిపోలో పనిచేస్తున్న సిబ్బంది అందరికీ ఒకగొప్ప మార్పుకు ఇదే శ్రీకారం అనే కార్యక్రమాన్ని ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఉద్యోగులందరూ మానసిక ఒత్తిడి తగ్గించుకోవడం, సంస్థ ఆదాయం ఏవిధంగా పెంచాలి, ప్రజాసంబంధాలు ఎలా మెరుగు పరుచుకోవాలని అనే అంశాలపై నిష్ణాతులైన వారితో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు.

## కొండాపురం మైన్‌ను సందర్శించిన టీబీజీకేఎస్ నాయకులు

మణుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్27:

సింగరేణి సంస్థ మణుగూరు ఏరియా కొండాపురం భూగర్భగనిని గురువారం మణుగూరు ఏరియా టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షులు వి.ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో బ్రాంచి నాయకులు సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తమ యూనియన్ ప్రత్యేకచొరవ ద్వారా వచ్చే నెల రెండవ వారంలో మైన్ నందు బొగ్గు ఉత్పత్తి పనులు ప్రారంభమవు తాయన్నారు. గనిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ఏరియా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని ఆయన తెలిపారు. బ్రాంచి నాయకులు కోట శ్రీనివాసరావు, కాపా శివాజీ, సీహెచ్‌వి.రెడ్డి, పాల్గొన్నారు.

## ఎన్నికుట్రలు చేసినా టీఆర్ఎస్‌ను అడ్డుకోలేరు

మండలంలో గులాబీ శ్రేణుల ఆందోళన

బీజేపీ నాయకుల దిష్టి బొమ్మ దహనం

కరకగూడెం,ప్రభాతవార్త:



తెరాస ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం పై గులాబీ శ్రేణులు మండల కేంద్రంలో ఆందోళన నిర్వహించారు. భాజపాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కరకగూడెం టీఆర్ఎస్ మండల అధ్యక్షులు రావుల సోమయ్య,ఎంపీపీ రేగా కాళిక ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు ప్రజా స్వామ్యాన్ని కాపాడిన టీఆర్ఎస్ ఎమ్మెల్యేల పై ప్రభావితం చేసే కుట్రలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. భాజపా నాయకులు డబ్బులు వెదజల్లి తెరాస ఎమ్మెల్యేలను కొనలేరని సోమయ్య మండి పడ్డారు. మండల ప్రధాన కార్యదర్శి బుడగం రాము, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కొమరం రాంబాబు, సీనియర్ నాయకులు అక్కిరెడ్డి వెంకటరెడ్డి, సత్యనారాయణ. పాల్గొన్నారు.

## బీజేపీని అప్రతిష్టపాలు చేసేందుకు కుట్రలు

- టీఆర్ఎస్‌కు సమాధి కట్టేరోజులు వచ్చాయి
- మణుగూరు బీజేపీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

మణుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్27:

మునుగోడు ఉపఎన్నికల్లో బీజేపీ విజయానికి చేరువలో ఉండడంతో టీఆర్ఎస్‌పార్టీ రాష్ట్ర నాయకత్వం బీజేపీని అప్రతిష్టపాలు చేసేందుకు కుట్రలు చేస్తుందని, నలుగురు ఎమ్మెల్యేలతో బూటకపు చేరికల కార్యక్రమాన్ని నిర్వహించడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తుందని మణుగూరు మండల, పట్టణ బీజేపీ నాయకులు



అన్నారు. తమపార్టీపై నిందలు వేయడాన్ని, కేసీఆర్ కుట్రపూరిత వైఖరిని ఖండిస్తూ మణుగూరు పట్టణ పూలమార్కెట్ సెంటర్‌లో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బూటకపు మంతనాల కార్యక్రమాన్ని ప్రజలందరూ కేసీఆర్ పన్నిన హైడ్రామాగా చెప్పుకుంటున్నారన్నారు. ఇలాంటి కార్యక్రమాల వలన టీఆర్ఎస్‌పార్టీకి ప్రజలే సమాధికట్టే రోజులు వచ్చాయన్నారు. మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా బీజేపీ గెలుపుకు చేరువలో ఉండడంతో టీఆర్ఎస్‌పార్టీ నాయకత్వం తట్టుకోలేక పోతుందన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా మునుగోడులో బీజేపీదే విజయమన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఈసాల వెంకటేశ్వర్లు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేరుగు రవీంద్రనాద్, పట్టణ అధ్యక్షులు లింగంపల్లి రమేష్, ముత్యాల వెంకటేశ్వరరావు, బత్తిని సాంబశివరావు, మీసాల దుర్గారావు, అనాబత్తుల వెంకన్న, కట్టా నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# టీఆర్ఎస్‌ను అస్థిర పరిచేందుకు బీజేపీ కుట్ర

## - ఇల్లెందులో టీఆర్ఎస్ నిరసన- పాత బస్టాండ్ సెంటర్లో దిష్టిబొమ్మ దహనం



**ఇల్లెందు, ప్రభాతవార్త :**

తెలంగాణను, టీఆర్ఎస్‌ను అస్థిర పరచాలని, టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బీజేపీ కొనుగోలు చేయాలనే కుట్రకు పూనుకుంటే భగ్నం చేశారని నాయకులు విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ఆదేశంతో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఇల్లెందు జగదాంబ సెంటర్లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నుంచి ప్రధాని నరేంద్ర మోది దిష్టిబొమ్మతో భారీ ప్రదర్శన చేశారు. అనంతరం ఇల్లెందు పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్ వద్ద ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోత్ హరిసింగ్‌నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ దిండిగాల రాజేందర్‌లు పాల్గొని మాట్లాడుతూ కేసీఆర్‌ను, రాష్ట్ర ప్రభుత్వాన్ని, టీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై బీజేపీ అగ్ర నేతలు కుట్ర పన్నారని, కుట్రల్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మున్సిపాలిటీలోని పలు వార్డుల కౌన్సిలర్లు, టీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జేకే-5 ఓసీని సందర్శించిన సేఫ్టీ జీఎం



**ఇల్లెందు, ప్రభాతవార్త :**

సింగరేణి ఇల్లెందు ఏరియాలోని జేకే-5 ఓపెన్ కాస్ట్‌లో గురువారం సేఫ్టీ జీఎం కార్పొరేట్ గురువయ్య సందర్శించారు. ఈ సందర్భంగా క్వారీలోని స్లయిడ్ బెంచ్, ఏరియా, డ్రిల్లింగ్, కాంప్లెక్షన్ గ్యాలరీస్, సేఫ్టీ ప్రొసీజర్స్‌ను తనిఖీ చేసి ముఖ్యంగా పాటించవలసిన రక్షణ సూత్రాలను తగు సూచనలు చేస్తూ ఎల్లప్పుడూ విధిగా రక్షణ సూత్రాలు పాటిస్తూ పనిలో ప్రమాదాలు జరగకుండా అప్రమత్తతతో ఉంటూ విధులు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా రక్షణాధికారి పంజాల శ్రీనివాసు, ప్రాజెక్టు అధికారి బొల్లం వెంకటేశ్వర్లు, గని మేనేజర్ పి.పూర్ణచందర్, సేఫ్టీ ఆఫీసర్ శివప్రసాద్, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## డ్రైవర్ల సంక్షేమంపై ప్రభుత్వాలు దృష్టిపెట్టాలి

**మణుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్27:**



మోటార్‌రంగ డ్రైవర్, ఓనర్ల సంక్షేమంపై కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిపెట్టాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఆర్.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆయన గురువారం తహశీల్దార్ కార్యాలయంలో పలుసమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. మోటార్ రంగ కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటుచేయాలని అర్హులైన నిరు పేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలని, సెంట్రల్ మోటార్‌వెహికిల్ సవరణ బిల్లు 2019ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ.గౌస్, సతీష్, వీరాచారి, శంకర్ పాల్గొన్నారు.

## పోడు సర్వే ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగాలి

### - టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అనుదీప్

**కొత్తగూడెం, అక్టోబర్ 27 - ప్రభాతవార్త:**

పోడు సర్వే ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగాలని జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ అన్నారు. పోడు భూముల సర్వే ప్రక్రియ, జాతీయ స్థాయిలో గ్రామ పంచాయతీలు అవార్డులు సాధనకు ప్రతిపాదనలు అప్‌లోడ్ చేయడం తదితర అంశాలపై గురువారం కలెక్టరేట్ నుంచి రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, అటవీ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పోడు సర్వే ప్రక్రియకు నియమించిన అన్ని టీములు ప్రతీ రోజు సర్వేలో పాల్గొనాలని, సర్వే ప్రక్రియ సజావుగా జరిగేందుకు మండల స్థాయి టీములు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. బుధవారం సర్వే ప్రక్రియలో 125 టీములు మాత్రమే పాల్గొన్నాయని, కారణాలను అడిగి తెలుసుకున్నారు. మండలస్థాయిలో పోడు సర్వే ప్రక్రియ నిర్వహణకు తహసీల్దార్ హెడ్‌గా వ్యవహరిస్తారని, పోడు సర్వేపై ప్రతీ రోజు నివేదికలు అందజేయాలన్నారు. సర్వే నిర్వహణకు నియమించిన అన్ని టీములు విధులకు హాజరు కావాలని, గైర్హాజరైన టీములకు ఆయా మండల ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. మండలంలో ఎన్ని టీములు క్షేత్రస్థాయి విచారణలో పాల్గొన్నాయో వివరాలను తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చాలా ప్రధానమైందని, 459 ప్రాంతాల్లో భూమి గుర్తించామని, గుర్తించిన భూములను ఎంపీడీవోలకు అప్పగించాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో అటవీ అధికారి రంజిత్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈవో విద్యాలత, డీఆర్‌డీవో మధుసూధన్‌రాజు, డీపీవో రమాకాంత్, ఆర్డీవో స్వర్ణలత పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఆరోపణలను ఖండించిన బిజెపి



**అశ్వాపురం,అక్టోబర్27,ప్రభాతవార్త.**

బీఆర్ఎస్ పార్టీ నలుగురు ఎమ్మెల్యేలను భారతీయ జనతా పార్టీలో చేర్చుకునేందుకు మొయినాబాద్ ఫామ్ హౌస్‌లో 100కోట్ల డలల్ జరిగిందని ఆ పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదని భాజాపా మండల అధ్యక్షుడు తాటిపాముల ఐలయ్య ఖండించారు.గురువారం మొండికుంటలో జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడుతూ మునుగోడు ఉప ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ ఓడిపోతుందనే భయంతో, ప్రజల దృష్టిని మరల్చేందుకు బిజెపిపైనిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు.ఈ సమావేశంలో కొల్లు లింగారెడ్డి,సురకంటి లింగారెడ్డి,పాటి వెంకటరెడ్డి,సురకంటి గంగారెడ్డి,బలబద్ర రామకృష్ణ పాల్గొన్నారు.

## ముంపు బాధితులకు పరిహారం చెల్లించండి



**అశ్వాపురం,అక్టోబర్27,ప్రభాతవార్త.**

జులై నెలలో గోదావరి వరదలకు ఇండ్లు నీటమునిగిన గ్రామాల బాధితులకు రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన 10వేల రూపాయల పరిహారం తక్షణమే అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ జన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల కరుణాకర్‌రెడ్డి,మండల అధ్యక్షుడు సురకంటి ప్రభాకర్‌రెడ్డి ముంపు బాధితులతో కలసి గురువారం తహశీల్దార్ వి సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మూడు నెలలు దాటినా నేటివరకు పరిహారం అందలేదని వాపోయారు. ఉన్నతాధికారుతో మాట్లాడి పరిహారం అందేలా కృషి చేస్తానని తహశీల్దార్ తెలిపారు. .వినతిపత్రం అందజేసిన వారిలో కొల్లు లింగారెడ్డి, సురకంటి నరేష్‌రెడ్డి,మామిడి శ్రీనివాస్,విజయ,చామంచుల పద్మ,రేసు కళావతి,కమటం జానమ్మ,పద్మ తదితరులున్నారు.




## నేడు ఇల్లెందులో మాజీ ఎంపి జన్మదిన వేడుకలు

**ఇల్లెందు, ప్రభాతవార్త :**

ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకల్ని శుక్రవారం ఇల్లెందులోని జిల్లా పరిషత్ ఛైర్మన్ కోరం కనకయ్య క్యాంపు కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఉదయం 11 గంటలకు కేక్ కటింగ్ ఉంటుందని, ఆ తర్వాత అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. టీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఉద్యోగ విరమణ పొందనున్న జీఎంకు సన్మానం



**ఇల్లెందు, ప్రభాతవార్త :**

కొత్తగూడెం కార్పొరేట్‌లో జీఎం ఎడ్యుకేషన్‌గా పనిచేస్తూ ఈ నెలలో పదవీ విరమణ చేయనున్న కె.పద్మనాభరెడ్డిని గురువారం ఇల్లెందు ఏరియా జీఎం కార్యాలయంలో జీఎం ఎం.షాలేమురాజు ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణిలో ఆయన చేసిన సేవలు మరువలేనివని, అంకితభావంతో పనిచేసి అదరి మన్ననలను పొందారని, ఆయన శేష జీవితం సుఖమయంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎస్వోటూజీఎం బండి వెంకయ్య, ఏరియా ఇంజనీర్ జి.ప్రభాకర్‌రావు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, డీజీఎం ఫైనాన్స్ వెంకటరామచంద్ర, డీవైజీఎం పర్చేజ్ విజయ్‌శేఖర్‌బాబు, డీవైజీఎం కె.విజయ్‌భాస్కర్, ఏరియా సర్వే అధికారి బి.బాలాజీనాయుడు, ఎస్ఈ స్టోర్స్ జి.ఆనంద్‌రావు, పర్యావరణాధికారి ధనుంజయ్‌రెడ్డి, ఐటీ మేనేజర్ ఆర్.సుధాకర్, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, ఎస్టేట్ అధికారి శివవీరకుమార్ పాల్గొన్నారు.

## ఎస్‌టి లైజనింగ్ ఆఫీసర్‌గా బ్రహ్మం ఎన్నిక



**ఇల్లెందు, ప్రభాతవార్త :**

సింగరేణి ఇల్లెందు ఏరియా గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం లైజనింగ్ ఆఫీసర్‌గా ఇల్లెందు ఏరియా కేవోసీ-2లో విధులు నిర్వహించే డిప్యూటీ మేనేజర్ ఉండం బ్రహ్మం ఎంపికైనట్లు సింగరేణి యాజమాన్యం జారీచేసిన ఉత్వర్వులను ఏరియా జీఎం ఎం.షాలేమురాజు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌టీ కమిటీ ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్‌టి లైజనింగ్ ఆఫీసర్ ఉండం బ్రహ్మంను పూలమాల, శాలువాతో జీఎం సన్మానించారు. బ్రహ్మం మాట్లాడుతూ సింగరేణిలో ఆర్వోఆర్ అమలు, రోస్టర్ పాయింట్ల వెరిఫికేషన్, అధికారుల కార్మికుల పదోన్నతులకై కృషి చేస్తానని, వివిధ విభాగాలలో, ఏరియా గనులలో బ్యాక్లాగ్ పోస్టుల భర్తీ కొరకు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. తన ఎంపికకు కృషి చేసిన యాజమాన్యానికి, ఎస్టీ అసోసియేషన్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్వోటూజీఎం బండి వెంకటయ్య, ఏరియా సేఫ్టీ అధికారి పి.శ్రీనివాసు, ఏరియా ఇంజనీర్ జి.ప్రభాకర్‌రావు, ఎస్ఈ స్టోర్స్ జి.ఆనందరావు, సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ అసోసియేషన్‌జనరల్ సెక్రటరీ బి.నాగేశ్వరరావు, ఇల్లెందు ఏరియా సెక్రటరీ మాలోత్ హరిసింగ్, సెంట్రల్ కమిటీ జాయింట్ సెక్రటరీ అజ్మీర ఉపేందర్, వైస్ ప్రెసిడెంట్ ఎం.దశరథ్, డి.శ్రీనివాస్, రామకృష్ణ, వీరన్నలు పాల్గొన్నారు.

# సమస్యల వలయంలో బిసి బాలుర వసతి గృహం

### సౌకర్యాల లేమితో విద్యార్థుల ఇక్కట్లు

అశ్వారావుపేట రూరల్, ప్రభాతవార్త:

మండల కేంద్రం అశ్వారావుపేటలో గల బిసి బాలుర సంక్షేమ గురుకుల పాఠశాల సమస్యల వలయంలో కొట్టిమిట్టాడుతుంది. విద్యార్థులకు తగ్గట్లు హాస్టల్‌లో వసతులు లేక పోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అశ్వారావుపేటలో నాలుగేళ్ళ క్రితం బిసి గురుకుల పాఠశాల మంజూరి కాగా అద్దె భవనాల్లో వసతి గృహాన్ని నడుపుతున్నారు. నాలుగు సంవత్సరాలు పూర్తయినా నేటికి సమస్యల సుడిగుండంలో పాఠశాల ఉంది. అతి ముఖ్యమైన మౌలిక వసతులు లేకపోవడం ఒక ఎత్తు అయితే సరైన మెనూ ప్రకారం పోషకాహారం అందించక పోవడం మరొక సమస్యగా మారింది. వసతి



గృహంలో మెనూ బోర్డు ఉన్నప్పటికి అది అలంకార ప్రాయమేనని ఆ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం, స్నాక్స్ అందడం లేదని తీవ్రంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థులు భోజనంను నించొని ఆదరా బాదరా తింటూ అర్థాకలితో కాలం గడుపుతున్నారు. విద్యార్థులకు డైనింగ్ హాల్ లేక పోవడం, మరుగుదొడ్లు లేక పోవడంతో అనేక ఇబ్బందులు



పడుతున్నారు. అంతే కాకుండా చుట్టూ అపరిశుభ్ర వాతావరణం దర్శనమిస్తూ కనిపిస్తుంది. చుట్టూ నెలకొన్న సమస్యలతో, మౌలిక వసతుల లేమితో విద్యనభ్య సిస్తున్న విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందా లేదా అనేది అర్థం కాని పరిస్థితి. బిసి బాలుర వసతి గృహ విద్యార్థులకు గ్రహణం ఎప్పుడు వీడి సమస్యలు పరిష్కారమౌతాయో వేచి చూడాలి.




# ఇర్పా కనకమ్మ మృతికి ఆజాద్ బాధ్యత వహించాలి

### -అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయిమనోహర్

చర్ల ప్రభాతవార్త :

చర్ల మండలం కుర్ణపల్లి గ్రామానికి చెందిన ఇర్పా కనకమ్మ (30) ఈ నెల 24వ తేదీ రాత్రి తన ఇంటిలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిందని, ఈమె భర్త అమాయకుడైన ఇర్పా రాముడుని మావోయిస్టు పార్టీ నాయకులు పోలీసు ఇన్‌ఫార్మర్ నెపంతో ఈ సంవత్సరం ఆగష్టు నెల 30వ తేదీన అర్ధరాత్రి ఇంటి నుండి అతన్ని బలవంతంగా బయటకు తీసుకువెళ్ళి మావోయిస్టు నాయకులు ఆజాద్ ఆదేశాలతో కిరాతకంగా హత్యచేయడం జరిగిందని, దీనికి సీపీఐ (మావోయిస్టు) పార్టీ చేత హత్యచేయబడిన కుర్ణపల్లి ఉపసర్పంచ్ ఇర్పా రాముడు, అతని



భార్య కనకమ్మల మరణాలకు ఆజాద్ బాధ్యత వహించాలని అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయి మనోహర్ పేర్కొన్నారు. అన్యాయంగా అత్యంత క్రూరంగా అమాయకుడైన తన భర్తను పోలీసు ఇన్‌ఫార్మర్ అనే అనుమానంతో నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీ హత్య చేయడం భరించలేని కనకమ్మ అప్పటి నుండి తీవ్ర మనస్థాపం చెంది 24వ తేదీ రాత్రి తన ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిందని, నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీ నాయకులు మూర్ఖత్వపు సిద్ధాంతాలలో అమాయకపు ఆదివాసీ గిరిజనుల ప్రాణాలను తీస్తున్నారని అన్నారు. ఆదివాసీ ప్రజాలారా ఇప్పటికైనా మావోయిస్టుల దుశ్చర్యలను గ్రహించండి .. కొత్తపల్లికి చెందిన జాడి బసంత్ అలియాస్ వసంత్‌ను కూడా పోలీసు ఇన్‌ఫార్మర్ నెంపతో హత్య చేయడం ఎంతవరకు సమంజనం ... ప్రజలే తిరగబడి మావోయిస్టులకు బుద్ధి చెప్పాలని, వీరిలా అమాయక గిరిజనులు చాలా మంది మావోయిస్టు పార్టీ చేతిలో ప్రాణాలు కోల్పోవడమే కాకుండా చిత్రహింసలకు గురవుతున్నారని, ప్రజలు నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీ మూర్ఖపు చర్యలను గమనించి వారికి సహకరించవద్దని పిలుపునిచ్చారు.

## సిహెచ్‌సికి నూతన మెడికల్ ఆఫీసర్

అశ్వారావుపేట రూరల్, అక్టోబర్ 27 ప్రభాతవార్త:



అశ్వారావుపేట కమ్యునిటి హెల్త్ సెంటర్‌కు నూతన మెడికల్ ఆఫీసర్ నియామకం కావడం జరిగింది. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక వైద్యశాలలో జయలక్ష్మి నియామకం కాబడ్డారు. ఈ మేరకు గురువారం ఆమె నూతన బాధ్యతలు స్వీకరించారు.

## వనదుర్గాంబిక ఆలయంలో కార్తీక పూజలు



అశ్వారావుపేట రూరల్, అక్టోబర్ 27 ప్రభాతవార్త:

మండల పరిధిలోని వేదాంతపురం గ్రామ శివారులో వేంచేసి ఉన్న శ్రీ వనదుర్గాంబిక సమేత వన లింగేశ్వర స్వామి దేవాలయంలో కార్తీమ మాస సర్వదినాన్ని పురష్కరించుకొని నవంబర్ 6వ తేదీన వన సమారాధనకు ఏర్పాట్లు చేశారు. ఈనేపథ్యంలో గురువారం వేదాంతపురం గ్రామ సర్పంచ్ సోమిని శివవంకర్ ప్రసాద్, ఆలయ సభ్యుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావును కలిసి వన సమారాధన కరపత్రాలను ఆవిష్కరింప చేశారు. కార్తీక మాస రెండవ ఆదివారం అనగా నవంబర్ 6న జరిగే వన సమారాధన కార్యక్రమంకు భక్తులు అధిక సంఖ్యలో రావాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## కోడి పందాల స్థావరంపై దాడి

అశ్వారావుపేట రూరల్, అక్టోబర్ 27 ప్రభాతవార్త:

కోడి పందాల స్థావరంపై గురువారం పోలీస్‌లు దాడి చేసి పట్టుకున్నారు. మండల పరిధిలోని నారంవారిగూడెం గ్రామ శివారులో కోడి పందాలు నిర్వహిస్తున్నారన్న విశ్వస నీయ సమాచారం మేరకు పోలీస్‌లు దాడి చేయడం జరిగింది. ఈ దాడిలో 9 మందిపై కేసు నమోదు చేయగా రూ.14,740ల నగదు, ఒక షిఫ్ట్ కారు, రెండు ద్విచక్రవాహనాలు, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్‌లు తెలిపారు.

## పేద మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ




ములకలపల్లి, అక్టోబర్ 27 ప్రభాతవార్త :

మండల పరిధిలోని జగన్నాధపురం పంచాయతీ రాజాపురం గ్రామంలో పేద, ఒంటరి మహిళలకు గురువారం కుట్టుమిషన్లను జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య చేతులమీదుగా 10 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోరం మాట్లాడుతూ పేద, ఒంటరి మహిళలను ఆదుకునేందుకు లివింగ్ హార్ట్ సోషల్ సర్వీస్ సొసైటీ సంస్థ ముందుకు రావడం అభినందనీయమని, ప్రతిఒక్కరూ తమకు ఉన్న దానిలో కొంతపేదలకు సాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఫౌండర్ డేవిడ్ సన్, టీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు జారె ఆదినారాయణ, సీతాయిగూడెం సర్పంచ్ కారం సుధీర్, టీఆర్ఎస్ నాయకులు నాథనెల్, ఫాస్టర్లు రమేష్, చంద్రం, తిమోతి, శ్రవణ్, సునీల్,రోహిత్ పాల్గొన్నారు.

## నేడు తిమ్మంపేటలో ఉచిత వైద్యశిబిరం

ములకలపల్లి, అక్టోబర్ 27 ప్రభాతవార్త :

భద్రాచలం ఐటీడీఏ, వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని తిమ్మంపేట గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు మంగపేట వైద్యురాలు ఉదయలక్ష్మి గురువారం తెలిపారు. ఈ శిబిరం శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగుతుందని, శిబిరంలో స్త్రీల, పిల్లల, నేత్ర, చెవి, ముక్కు, గొంతు వైద్యులు, సాధారణ వైద్యులు, కీళ్ళ, ఎముకల వైద్యులు హాజరై శిబిరానికి వచ్చేవారికి ఆరోగ్య పరీక్షలు చేస్తారని తెలిపారు. గర్భిణులకు స్కానింగ్, అన్ని రక్తపరీక్షలు చేయడం జరుగుతుందని,ప్రజల ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## జీకేవోసీలో ఉద్యోగులకు మెడికల్ క్యాంపు



కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 27 - ప్రభాతవార్త:

సింగరేణి మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏరియా పరిధిలోని జీకేవోసీ మైన్‌లో ఏరియా జీఎం జక్కం రమేష్ ఆదేశాల మేరకు ఉద్యోగుల కోసం మెడికల్ శిబిరాన్ని నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నారు. గురువారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు వైద్య శిబిరం జరగనుంది. ప్రధాన ఆస్పత్రి వైద్యులు పరశురాములు, అరుంధతిలు పాల్గొని వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 150 మందికి ఉచిత మధుమేహ, బీపీ పరీక్షలు చేశారు. శారీరక బరువు నిర్వహించడంతో పాటు వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకొని వ్యాధల నుంచి ఎలా కాపాడుకోవాలో, పాటించాల్సిన పద్దతులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి మేనేజర్ మురళి, డీజీఎం పర్సనల్ సామ్యూల్ సుధాకర్, ఏరియా టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్‌లు పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన డ్రైన్ పనులు

కొత్తగూడెం మున్సిపాలిటీ, అక్టోబర్ 27 - ప్రభాతవార్త:



సూపర్‌బజార్ పెట్రోల్ బంక్ నుంచి గౌతంమోడల్ స్కూల్ వరకు ఉన్న ప్రధాన డ్రైనేజీలో పెట్రోల్ బంక్ పక్కన ఉన్న డ్రైనేజీ మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో పాద చారులు, వాహనదారులు ఇబ్బం దులు పడుతున్నారు. ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, కలెక్టర్ అనుదీప్‌ల ఆదేశాల మేరకు చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి డ్రైనేజీ ప్రవహిస్తున్న స్థలం వద్దకు వెళ్లి మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. డ్రైన్ పనులకు సహకరించాలని కోరారు. వెంటనే దగ్గరుండి జేసీబీతో పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. కౌన్సిలర్ రుక్మాంగదర్ బండారి, కోలాపురి ధర్మరాజు, పరమేష్ యాదవ్, కమిషనర్ నవీర్‌కుమార్, ఏఈ రాము, చారీ, సిబ్బంది పాల్గొన్నారు.

## చుండూరులో కోనేరు ప్రచారం



కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 27 - ప్రభాతవార్త:

మునుగోడు నియోజకవర్గంలోని చుండూరు మున్సిపాలిటీలో బీజేపీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటికి ప్రచారం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ పాల్గొని ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముళీధర్‌రావు, రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు గస్తీ ముమ్మరం చేయాలి

**-కారేపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సిపి**

*కారేపల్లి, ప్రభాతవార్త, అక్టోబర్ 27*

సమాజంలో నేరాల నియంత్రణకు సంబందించి పోలీసు గస్తీ ముమ్మరం చేయాలని ఖమ్మం పోలీస్ కమీషనర్ విష్ణు ఎస్ వారియర్ పోలీసు అధికారులను సిబ్బందిని ఆదేశించారు. కారేపల్లి పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్స పెక్టర్ కార్యాలయాన్ని పోలీసు కమీషనర్ సందర్శించి రికార్డులు తనిఖీ చేసారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను చూడడంతోపాటు రిసెప్షన్‌కౌంటర్‌ను రికార్డులను తనిఖీ చేసారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న ఫంక్షనల్ వర్టికల్స్‌ను సందర్శించారు. ఫైవ్ ఎస్ అమలులో భాగంగా పోలీసు స్టేషన్‌లో స్టేషనరీ విభాగం పరిశుభ్రంగా ఉండటంతోపాటు అవసరమైన రికార్డులు వసు_వులు క్రమపద్దతిలో పెట్టడం, పరిసరాలలో సురక్షితమైన ఆరోగ్యవం తమైన వాతావరణం ఏర్పాటుచేసుకోవాలన్నారు. విధి నిర్వహణలో తమకు అప్పగించిన బాద్యతలను స క్రమంగా





నిర్వహించాలన్నారు. అదేవిధంగా స్టేషన్ హౌస్ మేనేజ్‌మెంటు పోలీసు స్టేషన్ నిర్వహణ యూనిఫాం, రెగ్యులర్ రోల్‌కాల్, వీక్లీ పరేడ్‌ను పోలీసు సిబ ్బంది, అధికారులు తప్పనిసరిగా అమలుచేయాలని ఆదేశించారు. పోలీసుస్టేషన్‌లోని రికార్డులను పరిశీలించటంతోపాటు పెట్రో కార్ సిబ్బంది ఏ విధమైన విధులు నిర్వహిస్తున్నారు, బీట్ డ్యూటీ సిబ్బంది ట్యాబ్ ద్వారా క్రైం ప్రో ఏరియాను ఏ విధంగా గుర్తిస్తున్నారో, నేరస్తుల నివాసాల కదలికను టా ్యబ్ ద్వారా చూపించాలన్నారు. అదేవిధంగా సిసి కెమెరాల ప్రాదాన్యతను వాటి ఉపయోగాలను వ్యాపారులు ప్రజలకు ఉపయోగించి అవసరమైన ప్రాంతాలలో సిసి కెమెరాలు అమర్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార ్యక్రమంలో రూరల్ ఎసిపి బస్వారెడ్డి, సింగరేణి సర్కిల్‌సిఐ ఆరీఫ్ ఆలీఖాన్, కారేపల్లి ఎస్ఐ పోలోజు కుశకుమార్, కామేపల్లి ఎస్ఐ అన్నం కిరణ్‌కుమార్, ఎఎస్ఐలు, హెడ్ కానిస్టే బుళ్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కారేపల్లిలో మోదీ దిష్టిబొమ్మ దహనం

*కారేపల్లి, ప్రభాతవార్త, అక్టోబర్ 27*

బిజెపి ప్రజాస్వామ్యంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూలదోసేందుకు చేస్తున్న కుటిల యత్నాలకు రాబోయే ఎన్నికల్లో ప్రజలే గుణపాఠం చెప్తారని మాజీ ఆత్మ కమిటి చైర్మన్ ముత్యాల సత్యనారాయణ,తెరాస మండల అధ్యక్షులు తోటకూరి రాంబాబులు అన్నారు. కారేపల్లిలో గురువారం బిజెపి పార్టీ కుట్రలకు కుతంత్రాలకు వ్యతిరేకంగా ప్రదాని నరేంద్రమోడీ దిష్టిబొమ్మను బస్టాండ్ సెంటర్ వద్ద దహనం చేసారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ బిజెపి అనేక రాష్ట్రాల్లో మెజారిటీ లేకపోయినా



ఆయా రాష్ట్రాల అధికార పార్టీ ఎంఎల్‌ఏలను కొనుగోలుచేస్తూ ప్రభుత్వాలను అస్థిరత్వం పాలుచేసేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా బిజెపికి ప్రజలు చరమగీతం పాడతారన్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో భారీ మెజార్టితో టిఆర్‌ఎస్ విజయం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రావూరి శ్రీనివాసరావు, మండల పార్టీ ఉపాధ్యక్షురాలు పప్పుల నిర్మల, బత్తుల శ్రీనివాసరావు, ఎండి హనీఫ్, మర్సకట్ల రోశయ్య, రాంకిషోర్‌నాయక్, మండల ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు తిప్పారపు నాగేంద్రబాబు,మజీద్‌పాషా, పిల్లి వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి రఘు, షేక్ గౌస్‌పాషా, బానోతు వీరన్న (చక్రం), వాంకుడోతు సక్రు, దారావత్ రాంబాబు, ఆంగోతు మత్రు, జూపల్లి రాము, ఆదర్ల రామరావు, పి నాగరాజు, మల్లేష్ పాల్గొన్నారు.

# కోతుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

*వైరా,అక్టోబర్27,ప్రభాతవార్త:*

కోతుల నియంత్రణ చర్యలు చేపట్టి వ్యవసాయ పంటల విధ్వంసం కాకుండా కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. వైరా మండలం గన్నవరం గ్రామంలో గురువారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో కోతులను నియంత్రించి పంటలను రుక్షించాలని డిమాండ్ చేస్తూ ప్రదర్శన నిర్వహించి గ్రామపంచాయతీ సర్పంచ్ వేమిరెడ్డి విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ వేలాది రూపాయలు పెట్టుబడితో రైతులు పంటలు పండిస్తే నిముషాలు వ్యవధిలో కోతులు పంటలను నాశనం చేస్తున్నాయని అన్నారు.



శత్రు దేశాల సరిహద్దుల వద్ద సైన్యం మోహరించిన విధంగా ప్రతిరోజు ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కోతులు భారీ నుంచి పంటలను కాపాడేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారని అన్నారు. రైతులపై కోతులు దాడి చేస్తున్నాయని, రైతులు మరణించిన సందర్భాలు ఉన్నాయని, చేతులు, కాళ్ళు విరగడం జరిగిందన్నారు. భవిష్యత్తులో వ్యవసాయం చేయడం కష్టమవుతుందని అన్నారు. ప్రకృతి వైపరీత్యాల వలన నష్టంతో పాటు కోతులు మూలంగా రైతులు భారీగా నష్టపోతున్నారని, పత్తి పంట కాపు దశ నుంచి మూడు నెలలు అదనంగా ఖర్చు రూ.30వేలు చెల్లించడం జరుగుతుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోతులు నియంత్రణ పద్ధతులు శాస్త్రీయంగా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు మందడపు ఉపేందర్, సిపిఎం మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, తెలంగాణ రైతు సంఘం మండల నాయకులు బాణాల శ్రీనివాసరావు, శీలం వెంకటరెడ్డి, షేక్ జానిమియా, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తూము సుధాకర్, సిఐటియు మండల కన్వీనర్ బాజోజ్ రమణ, నీటి సంఘం మాజీ చైర్మన్ వేమిరెడ్డి కోటిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కారుమంచి జయరావు తదితరులు పాల్గొన్నారు.

## నో హెల్మెట్ నోఎంట్రీ- మణుగూరులో అవగాహన

*మణుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్27:*

సింగరేణి సంస్థ మణుగూరు ఏరియాలో గురువారం నోహెల్మెట్ నోఎంట్రీ అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. సింగరేణి సంస్థ ఉద్యోగుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సింగరేణిలో అమలవుతున్న నోహెల్మెట్ నోఎంట్రీ కార్యక్రమంలో భాగంగా స్థానిక మెయిన్ చెక్‌పోస్ట్ వద్ద ప్రచారం నిర్వహించారు. హెల్మెట్‌ధారణ ప్రమాదాల నివారణ అనే కార్యక్రమాన్ని సేఫ్టీ అధికారి జేవీ.రమణ పర్యవేక్షణలో నిర్వహించారు. ద్విచక్రవాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఈ నెల 28 నుంచి ఏరియాలో నోహెల్మెట్ నోఎంట్రీ కార్యక్రమం పూర్తిస్థాయిలో అమలుచేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతిఒక్కరు విధిగా హెల్మెట్



ధరించి సహకరించాలని ఆయన కోరారు. పీకేఓసీ రక్షణ అధికారి ఎం.లింగబాబు, సెక్యూరిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## కుట్టుమిషన్‌లు అందజేత




*వైరా,అక్టోబర్27,ప్రభాతవార్త:*

వైరా లయన్స్‌క్లబ్, గ్రేట్ విజన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో లయన్ నూకల శ్రీనివాసరావు, వాణిశ్రీల సహకారంతో వివాహ వార్షికోత్సవ సందర్భంగా ఇద్దరు నిరుపేద మహిళలకు రెండు కుట్టుమిషన్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నాగేశ్వరరావు, ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, జోన్ చైర్మన్ లగడపాటి ప్రభాకర్, జిఎంటి కోఆర్డినేటర్ వుంద్రు శ్యామ్‌బాబు, కొణతాలపల్లి సుబ్బారావు, చింతలపూడి వెంకటేశ్వరరావు, సూతకాని శ్రీకాంత్, నంబూరి శ్రీనివాసరావు, గజ్జల కృష్ణమూరినత, గ్రేట్ విజన్ సెక్రటరీ తోటకూర శ్రీకాంత్, కోశాధికారికిషన్, రామకృష్ణ, వై.బుచ్చిరామారావు పాల్గొన్నారు.

## మిర్చిలో తామర పురుగులను నివారించండి



*కామేపల్లి, అక్టోబర్ 27, ప్రభాతవార్త :*

మిర్చి పంటలో తామర పురుగలు నివారణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ అధికారి బి తారాదేవి పలు సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో మిర్చి తోటలను సందర్శించిన మాట్లాడుతూ గత సంవత్సరం కూడా తామర పురుగు ఉధృతి వలన రైతులు చాలా మంది సరైన అవగాహన లేక విచ్చలవిడిగా మందులు పిచికారి చేశారన్నారు. నల్ల తామర పురుగుకు ప్రత్యేకంగా మందులు అంటూ ఏమి లేవని రసం పిల్చే పురుగు మందులు ఈ నల్ల తామర పురుగు మీద కూడా పనిచేస్తాయన్నారు. రైతులు కొత్త కొత్త మందులు అని, అవి కాకుండా గుంటూరు వెళ్ళి బయో మందులు తెచ్చుకుని పిచికారి చేశారన్నారు. నల్ల తామర పురుగు రావటానికి కొన్ని కారణాలు ఉన్నాయన్నారు. విచ్చలవిడిగా బయో మందులు వాడటం వలన ఈ నల్ల తామర పురుగు వస్తుందని, చేను గట్టు మీద కలుపు మొక్కలు లేకుండా చేసుకోవాలని, తుత్తూరు బెండ, వయ్యారి బామ మీద ఈ నల్ల తామర పురుగు ఆవాసం ఏర్పాటు చేసుకుంటుందన్నారు. ఈ నల్ల తామర పురుగు అప్పుడే ఏర్పడిన పూతలో పిప్పొడి తినటం వలన పరాగా సంపర్కం జరగకపోవటం వలన పూత నుండి కాయలు ఏర్పడవు. గత సంవత్సరం ఒక్కొక్క పూతలో 15 నుంచి 20 పురుగులు ఉండటాన్ని గమనించామన్నారు.. నివారణకు రైతులు విచ్చలవిడిగా మందులు పిచికారి చెయవద్దని, బయో మందులు వాడవద్దన్నారు. ఒక ఎకరాకు 25 నుంచి 30 నులి రంగు జిగురు అట్టాలు సామూహికంగా మిరప మొక్కకు ఒక అడుగు ఎత్తులో పెట్టుకోవాలని, దీని వలన నల్ల తామర పురుగు నీలి రంగుకి ఆకర్షణకు వచ్చి దానికి అతుకుంటుందన్నారు.వేప నూనె 1500పీపీఎంనీ ఒక లిటిల్ నీటికి 3ఎంఎల్/ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. నల్ల తామర పురుగు ఉదృతిని బట్టి ఆసిటమి ఫైడ్ 0.2గ్రా/లీటర్ లేదా రేజెంట్ 2ఎంఎల్/లీటర్ నీటికి పిచికారి చేయ్యాలి లేదా స్పెనోసాడ్ 60ఎంఎల్/ఒక ఎకరాకు పిచికారి చేసుకోవాలని, 2,3 మందులు కలిపి కొట్టవద్దని, మిరపలో పోగాకు లద్దె పురుగు నివారణకు థయోడికార్బ్ 1గ్రాం లేదా నోవల్యురాన్ 0.75మిల్లి లీటర్ లేదా ఫ్లూటెండామైడ్ 0.4గ్రాం, మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు, మిరపలో కాండం కుళ్ళు నివారణకు 1.5గ్రాం, థయోపనేట్ మిథైల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని, ప్రస్తుతం బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు ఆశించే అవకాశం ఉందని, దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 30గ్రాం, స్ట్రెప్టోస్ట్రె ప్టోసైక్లినిక్ 1గ్రాంను 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని, మిరపలో అధిక వర్షాలకు వేరు కుళ్ళు సోకినట్లయితతే నివారణకు 3గ్రాములు కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2.5గ్రాములు రెడోమిల్ ఎంజడ్ లీటరు నీటికి కలిపి పూర్తిగా తడిచేటట్లు పిచికారి చేసుకోవాలన్నారు.




# మునుగోడులో బిజేపి ఎన్ని కుట్రలు చేసినా విజయం తెరాసదే



*కల్లూరు, అక్టోబర్ 27, ప్రభాతవార్త*

మునుగోడు ఉప ఎన్నికల్లో తెరాస విజయాన్ని ఎవరూ ఆపలేరని, బిజేపి ఎన్ని కుట్రలు చేసినా విజయం తెరాసదేనని, బిజేపి నాయకుల్లారా.. డబ్బు అహంకార ధోరణి వీడండి అని, ఇక నుండి మునుగోడు ఉప ఎన్నికల్లో బిజేపి ఆటలు సాగవవని కల్లూరు జట్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, ఎంపీపీ బీరవల్లి రఘు అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుండి ప్రధాన రాష్ట్రీయ రహదారి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద భారీగా కార్లలో మునుగోడు ఉప ఎన్నికల్లో తెరాస అభ్యర్ధి కూసు కుంట్ల ప్రభాకర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ, జట్పీటీసీ, ఎంపిపితో పాటు రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు డాక్టర్ లక్కినేని రఘుల ఆధ్వర్యంలో గురువారం మునుగోడుకు వారు భారీగా కార్లలో తరలివెళ్ళారు. తొలుత వారు ప్రధాన రహదారిపై మాట్లాడుతూ డబ్బు పిచ్చి పట్టిన బిజేపి పార్టీ నాయకులు చేస్తున్న పిచ్చి చేష్టలపై వార నిరసన చేపట్టారు. భారీ ఎత్తున బిజేపి పాలనపై వారు ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మండల గ్రామ సర్పంచ్‌లు సింగిశాల పద్మ ప్రసాద్, వేము రత్తమ్మ, ఇస్సాకు, మోదుగు సుబ్బారావు, మోదుగు యశోదా వీరయ్య, నంద్రు అన్నపూర్ణ, సురేష్, వేము రాధమ్మ, వెంకటేశ్వర్లు, పాలెపు లక్ష్మీకాంతమ్మ, నందిగం ప్రసాద్, రావి సూర్యనారాయణ, గంగవరపు శ్రీనివాసరావు, మాజీ ఎంపిటిసి సభ్యులు వేము కృష్ణ, ఎంపిటిసి సభ్యులు మర్సకట్ల మేరమ్మ, దర్గయ్య, ఉప్పు సుబ్బారావు, కంచపోగు చిట్టిబాబు, సొసైటి చైర్మన్లు నర్వనేని అంజయ్య, చావా వెంకటేశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, రేషన్ డీలర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, కల్లూరు మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు సింగిశాల పద్మ ప్రసాద్, భూక్యా జ్యోతిరాం నాయక్, పుసులూరి శ్రీను, తాళ్ళూరి శ్రీను, తాళ్ళూరి అచ్చయ్య, భద్రాచలం, ప్రసాద్, పెద్ద ఎత్తున కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మునుగోడులో కల్లూరు టీఆర్ఎస్ నాయకుల విస్తృత ప్రచారం



*కల్లూరు, అక్టోబర్ 27, ప్రభాతవార్త*

సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో కల్లూరు టీఆర్ఎస్ పార్టీ నాయకులు మునుగోడు ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. కార్యక్రమంలో భాగంగా గురువారం మునుగోడులో టీఆర్ఎస్ అభ్యర్ధి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ వరి కల్లాల్లో రైతులను, ఎస్సీ కాలనీల్లో ఓటర్లను కలిసి టీఆర్ఎస్ పార్టీ అభ్యర్ధి గెలుపుకై విస్తృత ప్రచారం చేపడుతున్నారు. మసీదుగూడెం, శెరిల్లా తదితర గ్రామాల్లో ఇంటింటికి కరపత్రాలు, నమూనా, ఈవిఎంతో ప్రచారం చేస్తున్నారు. మునుగోడు అభివృద్ధి టీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యం అని, టీఆర్ఎస్ అభ్యర్ధి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక ఓట్ల మెజార్టితో గెలిపించాలని కోరుతూ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వాకిటి భూలక్ష్మి భూపాల్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు నర్సా రెడ్డి, సత్తుపల్లి నియోజకవర్గ నాయకులు చైర్మన్ కూసంపూడి మహేష్, ఆత్మ చైర్మన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, అడవిమల్లేల సర్పంచ్ మందడపు అశోక్‌కుమార్, నాయకులు మల్లూరు అంకమరాజు, మశీదుగూడెం ఇంఛార్జిలు, కప్పలబంధం, సిద్దారం సర్పంచ్‌లు నందిగం ప్రసాద్, సాధు జానకీరం, కల్లూరు మండల టీఆర్ఎస్ నాయకులు, జిల్లా రైతు సమన్వయ సమితి జిల్లా కమిటీ సభ్యులు పసుమర్తి చందర్‌రావు, టీఆర్ఎస్ మండల సెక్రటరి కొరకొప్పు ప్రసాద్, నాయకులు బైర్ల కాంతారావు, ఎండి. అయుబ్, వార్డు సభ్యులు ఉబ్బన పుల్లారావు, నరేందర్‌రెడ్డి, బొల్లెపోగు రవి, పసుపులేటి శ్రీనివాసరావు, కనకపూడి జయరాజు, కుంచాల గురవయ్య, మోదుగు ఆశీర్వాదం, కంభంపాటి పుల్లాచారి, ఈసుబ్, ఖమ్మంపాటి వెంకటేశ్వర్లు, మాతిపోగు రాము, గద్దల వెంకటేశ్వర్లు, ఖమ్మంపాటి నాగరాజు, ఖమ్మంపాటి దేవదాస్, కిన్నెర యాకోబు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లాడలో మోదీ దిష్టిబొమ్మ దహనం



*తల్లాడ, ప్రభాతవార్త, అక్టోబర్ 27*

తల్లాడ మండల తెరాస ఆధ్వర్యంలో తల్లాడ బస్‌స్టాండ సెంటర్‌లో సిఎం కెసిఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ఖ కెటిఆర్ , సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య, జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌సి తాతా మదు ఆదేశాల మేరకు తెలంగాణలో బిజెపి తెలంగాణ ఎంఎల్‌ఏలను కొనుగోలు చేయడానికి కుట్రలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వ (మోదీ) దిష్టిబొమ్మను దగ్దం చేసారు. ఈ కార్యక్రమంలో పార్టీ బాద్యులు రెడ్డం వీరమోహనరెడ్డి, దొడ్డా శ్రీనివాసరావు, దిరిశాల ప్రమీల, దూపాటి భద్రరాజు, శీలం కోటారెడ్డి, దగ్గుల శ్రీనివాసరెడ్డి, దిరిశాల దాసూరావు, బద్దం కోటిరెడ్డి, కేతినేని చలపతిరావు, గుండ్ల నాగయ్య, కాంపాటి జలమయ్య, మారెళ్ల దేవేంద్రరావు, తేలూరి రఘు పాల్గొన్నారు.

## సాత్వికను అభినందించిన ఎంపిపి

*తల్లాడ, ప్రభాతవార్త, అక్టోబర్ 27*

మండల పరిదిలోని నరసింహులపేటకు చెందిన శనక్కాయాల మోహనరావు–నాగమణి దంపతుల కుమార్తె సాత్విక ఓణీల అలంకరణ వేడుక, కుమారుడు ఉపేందర్‌కు పంచెకట్టు వేడుక గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపిపి దొడ్డా శ్రీనివాసరావు చిన్నారులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరక్టర్ గోవిందు శ్రీనివాసరావు, తెరాస నాయకులు మారెళ్ల మమత, నాయకులు పాల్గొన్నారు.



## శివాలయంలో సోలార్ విద్యుత్ కంచె ఏర్పాటు



*తల్లాడ, ప్రభాతవార్త, అక్టోబర్ 27*

తల్లాడలోని గొల్లగూడెం వెళ్లే రహదారిలో గల శ్రీరామలింగేశ్వరస్వామి వారి ఆలయానికి దాతలు సోలార్ విద్యుత్ కంచె ఏర్పాటుచేసారు. తల్లాడకు చెందిన తెరాస నాయకులు గోపిశెట్టి వెంకటేశ్వర్లు కుమారుడు సుశ్రుత్ కుమార్, గురజాల రామకిష్టారావు కుటుంబసబ్యులు సుమారు లక్ష రూపాయలు వితరణగా అందించారు. వీటితో ఏర్పాటుచేసిన ఈ కంచెను తెరాస నాయకులు గోపిశెట్టి వెంకటేశ్వర్లు, గురజాల సీతారామచంద్రరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పెద్దలు వేమిశెట్టి నాగన్న, నంబూరి మోహన్‌రావు కేతేపల్లి భాస్కర్‌రావు, బొజ్జ నరసింహారావు, సరికొండ హరీష్‌రాజు, అనుమోలు సర్వేశ్వరరరావు, గుంటుపల్లి వెంకటయ్య, అనంతరామయ్య, రాయల తిరుమలయ్య, రామకిష్ణ, వేమిశెట్టి వెంకటేశ్వరరావు, చంద్రం, వార్డు సభ్యులు రఘు, తొండపు వెంకటకిష్ణ, పూజారి నుదురుపాటి ప్రసాద్‌శర్మ, మణికంఠ, కంచల సతీష్‌శర్మ పాల్గొన్నారు.

## ఉచిత చేప పిల్లలు పంపిణి

*కల్లూరు, అక్టోబర్ 27, ప్రభాతవార్త*

వ్యవసాయ మార్కెట్ కల్లూరులో గురువారం మండల పరిధిలోని తాళ్ళూరు వెంకటాపురం, ఎర్రబోయినపల్లి, పాయ్‌పూర్, ముగ్గు వెంకటాపురం, లోకవరం గ్రామాల చెరువులకు సుమారుగా 55 చెరువులకు 8 లక్షల 6 వేల 600 చేప పిల్లలను మత్స్యశాఖ అధికారులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి బుజ్జిబాబు, తహశీల్దార్ జంగం బాబ్జి ప్రసాద్, ఇంఛార్జి ఎంపిడిఓ మహాలక్ష్మి, ఆర్ఐ స్టాలిన్, కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెక్కిలాల లక్ష్మణరావు, చేపల సొసైటి అధ్యక్షులు చింతకాయల వెంకటేశ్వరరావు, మండలంలోని వివిధ గ్రామాల మత్స్యకార్లు పాల్గొన్నారు.

## మసీద్‌గూడాలో మోడి దిష్టిబొమ్మ దహనం



*పెనుబల్లి, అక్టోబర్ 27, ప్రభాతవార్త*

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తే, టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొనేందుకు భారీ కుట్రకు తెరతీసిన బిజేపి కుట్రలకు నిరసనగా సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఇంఛార్జిగా పనిచేస్తున్న మసీద్‌గూడాలో గురువారం స్థానిక నాయకులతో కలిసి ప్రధాని నరేంద్ర మోడి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కనగాల వెంకట్రావు మాట్లాడుతూ బిజేపి తెరాస ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి తెరాస ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కుట్రలు పన్నుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో కల్లూరు ఎఎంసి చైర్మన్ చెక్కిలాల లక్ష్మణరావు, ఆవిటి మారేశ్వరరావు, గోవిందరావు, ప్రసాద్, తాతారావు, శేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## నూతన్‌కల్లులో ఘనంగా అయ్యప్ప పూజలు



*తల్లాడ, ప్రభాతవార్త, అక్టోబర్ 27*

మండలం నూతన్‌కల్లఓ గణేషుల రవి స్వామి కుమారుడు కార్తికేయ పుట్టినరోజు సందర్భంగా వారి నివాసంలో కర్నాటి గురుస్వామి ఆధ్వ ర్యంలో పెద్ద గురుస్వామి ప్రసాద్ స్వామి పూజా కార్యక్రమంలో ఘనంగా నిర్వహించిన అయ్యప్ప పడి పూజలో జిల్లా తెరాస నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, జిల్లా మాజీ డిసిసిబి చైర్మన్ మువ్వా విజయ్‌బాబు స్వామి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు సహకార సంఘం అద్యక్షులు పాలెపు రామారావు గురుస్వామి, అంజనాపురం గురుస్వామి, కల్లూరు కాటేపల్లి కిరణ్‌కుమార్ స్వామి, కృష్ణా పాముల స్వామి, మువ్వా గూడూరు గురుస్వామి, ముచ్చరాం గురుస్వామి, చారి స్వామి, శ్రీధర్ స్వామి, పొట్రూ శ్రీనివాస్‌రావు స్వామి, నూతన్ కల్ అయ్యప్ప బృందం, కల్లూరు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ: డీసీపీ

*నర్సంపేట, అక్టోబర్ 27, ప్రభాతవార్త*

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా దొంగతనాలు, నేరాలను పూర్తి స్థాయిలో నియంత్రించుకోవచ్చని డీసీపీ వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని లక్నెపెల్లి గ్రామంలో సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని 32 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఏసీపీ సంపత్‌రావు, సీఐ పులిరమేష్‌గౌడ్, ఎస్ఐ సురేష్, స్థానిక సర్పంచ్‌లు గొడిశాల రాంబాబు, పాలకవర్గ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నరేంద్రమోడి దిష్టిబొమ్మ దహనం

**నేలకొండపల్లి, అక్టోబర్ 27 ప్రభాతవార్త:**
టిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను బిజెపి పార్టీ అక్రమంగా కొనుగోళ్ళు చేసేందుకు ప్రయత్నించడాన్ని నిరసిస్తూ టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గురువారం నేలకొండపల్లి లోని పిఎస్సార్ సెంటర్ నందు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అలాగే, ఖమ్మం-కోదాడ ప్రధాన రహదారి పై ప్రధాని నరేంద్రమోడి దిష్టిబొమ్మను వారు దగ్ధం చేస్తూ నినాధాలు చేసారు. ఈ కార్యక్రమంలో నేలకొండపలి ల్ల మండల టిఆర్ఎస్ అధ్యక్షుడు



ఉన్నం బ్రహ్మయ్య, స్థానిక ఎంపిపి వజ్జ రమ్య, ఎంపిటిసి మెంబర్ శీలం వెంకటలక్ష్మీ, మండల రైతుబంధు కన్వీనర్ శాఖమూరి సతీష్,

పట్టణ టిఆర్ఎస్ అధ్యక్షుడు వంగవీటి నాగేశ్వరరావు, కార్యదర్శి గొలుసు రవి, మండల పరిషత్ కోఆప్షన్ మెంబర్ ఎండి వాజిద్, శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం చైర్మన్ రాయపూడి శ్రీనివాసరావు, శ్రీఉత్తరేశ్వరస్వామి దేవాలయం చైర్మన్ రాజపుత్ర శ్రీనివాససింగ్, శ్రీరాజగోపాలస్వామి దేవాలయం చైర్మన్ కూరాకుల నాగేశ్వరరావు, శ్రీభీమేశ్వరస్వామి దేవాలయం చైర్మన్ బాజా నాగేశ్వరరావు, మండల టిఆర్ఎస్ నాయకులు వజ్జా శ్రీనివాస రావు, నంబూరి సత్యనారాయణ, కొండా కనకప్ర సాదు, మోరం మల్లయ్య, కైలాసపు వెంకటే శ్వర్లు, దండా రంగయ్య, జటంగి వెంకన్న, చంటి, తన్నీరు కృష్ణమూర్తి, కుక్కల సామేలు, శాయిని సత్యనారాయణ పాల్గొన్నారు.

# గొర్రెలకు బదులుగా నగదు బదిలీ చేయాలి

**నేలకొండపల్లి, అక్టోబర్ 27 ప్రభాతవార్త:**
గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా రెండవ విడతలో లబ్దిదారులకు ప్రభుత్వం గొర్రెలకు బదులుగా నగదు బదిలీ చేయాలని గొర్రెల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బారీ మల్సూర్‌యాదవ్ డిమాండ్ చేసారు. గురువారం ఇక్కడ గొర్రెల పెంపకందారుల సంఘం సమావేశంలో మల్సూర్ మాట్లాడుతూ కురుమ, యాదవులను ఆర్దికాభివృద్ధి చెంసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 75 శాతంతో గొర్రెల ప ంపిణీ పథకంను అమలు చేస్తోందని,గొర్రెల పంపిణీ



పథకం మొదటి విడతలో దళారుల వలన కురుమ, యాదవులకు నష్టం , గొర్రెల పంపిణీలో దళారుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రతి గొర్రె కాపరికి రూ.లక్ష 75వేలు ఇవ్వాలని చెప్పారు. గొర్రెల కాపరులకు ఇన్స్ రెన్స్ చేయాలని, గొర్రెలకు షెడ్లు నిర్మించాలని కోరారు. ఈ సమావేశంలో గొర్రెల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి మేకల నాగేశ్వరరావుయాదవ్, సంఘం మండల నాయకులు గొలుసు రవియాదవ్, కనకబండి రమేష్‌యాదవ్, పిన్నబోయిన కోటేశ్వరరావు యాదవ్, కనకబండి కనకరాజుయాదవ్, బొల్లం సత్యనారాయణయాదవవ్, మల్లెబోయిన ఉపేందర్‌యాదవ్, బడేటి సోమయ్యయాదవ్, జంగా యలమందరావుయాదవ్, పల్లెబోయిన బుచ్చిబాబుయాదవ్, గోళ్ళ శ్రీనివాసరావుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీలలో మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

**బూర్గంపహాడ్, ప్రభాతవార్త :**
గ్రామపంచాయతీలలో మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, కారోబార్లు బిల్ కలెక్టర్‌కు ప్రత్యేక హోదా గుర్తింపుని ఇవ్వాలని, తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు శివ అధ్యక్షతన సారపాకలో జరిగిన గ్రామపంఆయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ భద్రాద్రికొత్తగూడెం జిల్లా మహాసభలో చాగంటి వెంకటయ్య పాల్గొని మాట్లాడుతూ .. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామంపచాయతీ కార్మికుల చేత వెట్టిచాకిరి చేయిస్తుందని విమర్శించారు. నిర్దిష్టమైన పనిగంటలను ప్రకటించాలని, 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, పంచాయతీ కార్మికులందరికి పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని అమలు డిమాండ్ చేశారు. కారోబార్లు బిల్ కలెక్టర్‌లను మొత్తం గ్రామంపచాయతీ కార్మికుల నుండి వేరు చేయడం కోసం కొన్ని కొన్ని సంఘాలు ప్రయత్నాలు




చేస్తున్నాయని, వాటికి వ్యతిరేకంగా పంచాయతీ కార్మికులు బిల్ కలెక్టర్‌లు కారోబోర్లు అందరం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి తేజ రమేష్ మాట్లాడుతూ .. మల్టీపర్పస్ విధానం పేరు చెప్పి సర్పంచ్‌లు, అధికారులు కార్మికులను వేధింపులకు గురి చేస్తున్నారని, వేధింపులను ఆపకపోతే వేధింపులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకత్వంలో గ్రామపంచాయతీ కార్మికుల అందరం ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ జిల్లా మహాసభల్లో గ్రామంపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి కే.బ్రహ్మాచారి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకులు నిమ్మల బంధు, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు సతీష్, కళ్యాణ్, సాయిరత్న, పీ.యాకూబ్, నరసింహారావు, రంగా కృష్ణార్జునరావు, చారి, సతీష్, వెంకన్న, ఎస్.పద్మ, యాకూబ్, సురేష్ పాల్గొన్నారు.

## బూర్గంపహాడ్ బిఆర్ఎస్ ఎస్సీ సెల్ కమిటీ ఎన్నిక

**బూర్గంపహాడ్, ప్రభాతవార్త :**
బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో బూర్గంపహాడ్ బిఆర్ఎస్ పార్టీ మండల ఎస్సీ సెల్ మండల అద్యక్షులు వలదాస సాలయ్య అద్యక్షతన పినపాక నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు వెన్న అశోక్‌కుమార్, మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో గ్రామకమిటీని గురువారం ఎన్నుకున్నారు. బూర్గంపహాడ్ గ్రామ అధ్యక్షుడిగా మందా ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కుమ్మరిపల్లి నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు వెన్న అశోక్, బూర్గంపహాడ్ మండల టిఆర్ఎస్ అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు సాలయ్య, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దాసరి కాంతారావు, ఎస్సీ పట్టణ నాయకులు కోట రమేష్, కేసుపాక మహేష్, రమేష్, బొందరయ్య, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, గంగపూరి శేఖర్, కేసుపాక



సంపత్, మండల విద్యార్ధి సంఘం నాయకులు బర్ల ప్రవీన్‌కుమార్, దేగల నవీన్, తోకల రవిప్రసాద్, వేణు, సాయిరాం, కామేశ్వరరావు, బర్ల వంశీ, బుయ్యన వంశీ, విజయ్, నాగరాజు, కొప్పుల రాఘవులు, పున్నం తదితరులు పాల్గొన్నారు.




## తలసేమియా బాధితుల కోసం రక్తదానం చేయండి



**నేలకొండపల్లి, అక్టోబర్ 27 ప్రభాతవార్త:**
తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదానం చేసి కాపాడాలని నేలకొండపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్‌సి) వైద్యాధికారి డాక్టర్ కే.రాజేష్ పిలుపు నిచ్చారు. గురువారం నేలకొండపల్లి లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు తలసేమియా వ్యాదిగ్రస్తుల కోసం హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. సిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కే.రాజేష్ మాట్లాడుతూ తలసేమియా భాదితులకు తరచుగా రక్తమార్పిడి చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఈ వైద్య శిభిరంలో తలసేమియా వ్యాదిగ్రస్తులకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపలి ల్ల పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సిహెచ్.మణిదీప్, పిహెచ్ఎన్ చావా దుర్గ, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరిబాధ్యత



**నేలకొండపల్లి, అక్టోబర్ 27 ప్రభాతవార్త:**
పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి భాద్యత అని నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్స్‌పాల్ వై.సత్యనారాయణరెడ్డి వెల్లడించారు.

గురువారం నేలకొండపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ నందు ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వాలంటీర్‌లు కళాశాల ఆవరణ లోని చెత్తా చెదారంను తొలగించి శుభ్రం చేసారు. కళాశాల ఆవరణలో నిల్వ ఉన్న మురుగు నీటిని బయటకు తరలించారు. ప్లాస్టిక్ వ్యర్ధాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆర్.ఆమోస్, కళాశాల అధ్యాపకులు గురవయ్య, భారత్, లక్ష్మణ్, భాస్కర్, రవి, ప్రమోద్, సూర్యప్రకాష్, తిలక్, నాగశ్రీ, కళ్యాణీ, బాలకృష్ణ, గ్రంధపాలకులు రమాదేవి, కళాశాల సూపరిండెంట్ పాషా, రికార్డు అసిస్టెంట్ వెంకటనారాయణ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## మోడీ దిష్టిబొమ్మ దహనం

**ముదిగొండ,అక్టోబర్ 27, ప్రభాతవార్త :**
ఎమ్మెల్యేలను డబ్బులతో ప్రలోభ పెట్టిన ఘటనకు నిరసనగా మండల కేంద్రమైన ముదిగొండలో ఖమ్మం కోదాడ ప్రధాన రహదారిపై అంబేద్కర్ సెంటర్‌లో టీఆర్ఎస్ట కమిటీ మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ ఆటలు తెలంగాణలో సాగవాని



హెచ్చరిస్తూ నినాదాలు చేశారు. సిగ్గు లేకుండా రాజకీయ వికృత చర్యలకు పాల్పడుతున్న బీజేపీని దేశవ్యాప్తంగా ప్రజలు తిరస్కరిస్తున్నారన్నారు. ఎన్నికల్లో గెలిచే దమ్ము లేకనే బీజేపీ ఇలాంటి సిగ్గులేని ప్రయత్నాలు చేస్తుందని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సామినేని హరిప్రసాద్, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ పోట్ల ప్రసాద్, టీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకట్, బీసీ సెల్ మండల అద్యక్షుడు తోట ధర్మారావు, నేలకొండపల్లి మార్కెట్ డైరెక్టర్ వీరారెడ్డి, టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పసుపులేటి వెంకట్, మందరపు ఎర్ర వెంకన్న, కోటి అనంతరాములు, యాదవ్ సంఘం మండల అద్యక్షులు ధనియాకుల వీరస్వామి, కార్యదర్శి అమరబోయిన వీరబాబు, బండ్ల వాసు, పచ్చ సీతారామయ్య, బిక్షం, దారా రాము, చోటయ్య, నర్సింహారావు, ఉపేందర్, రాము తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలి నెల గడుస్తున్నా పట్టించుకోని అధికారులు

- ఆందోళనలో అన్నదాతలు
- లైన్‌మెన్‌కు ఫోన్ చేస్తే ప్రైవేట్ వ్యక్తులను పంపిస్తున్న వైనం
- పైసల కోసమే పట్టించుకోవడం లేదంటు మండలంలో ఆరోపణలు



చంద్రుగొండ, అక్టోబర్ 27 - ప్రభాతవార్త:

చంద్రుగొండ మండలంలోని కాసుల కోసం కరెంట్ వాళ్ల కక్కుర్తి పడి ప్రజలను పీడిస్తున్నారని ఆరోపణలు వినపడుతున్నాయి. ఏ పని కావాలన్నా పైసలు ఇస్తే చాలు ఆ పని అవుతుంది... లేదంటే నిబంధనలు అధికారులకు గుర్తుకొస్తుంది. అందులోనే భాగంగానే రైతుల ట్రాన్స్‌ఫార్మర్ కాలి నెల రోజులు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినపడుతున్నాయి. బోర్లని నమ్ముకొని వ్యవసాయం చేస్తున్న రైతులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు ఫోన్‌లు చేసినా స్పందించకపోగా అన్నదాతలను అవమానించేలా అధికారులు మాట్లాడుతూన్నరని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే... చంద్రుగొండ మండలం రావికంపాడు గ్రామానికి చెందిన కొందరు రైతులు బోరు బావులను నమ్ముకొని వరి, మిర్చి సాగు చేస్తున్నారు. గత నెల రోజుల క్రితం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో సంబంధిత లైన్‌మెన్‌లకు ఫోన్ చేసిన అన్నదాతలతో అవమానించేలా మాట్లాడటంతో పాటు తను చేయాల్సిన పనిని ప్రైవేట్ వ్యక్తులతో చేస్తున్నారని తెలిపారు. కనీసం అటువైపు కూడా లైన్‌మెన్ కన్నెత్తి చూడకుండానే ప్రైవేట్ వ్యక్తులను పంపించి ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు కోసం కొత్తగూడెం వెళ్లేందుకు ట్రాక్టర్‌ని సిద్ధం చేసుకోవాలని తెలపడంతో అన్నదాతలు ఆశతో గ్రామంలోనే ట్రాక్టర్‌ని కిరాయికి తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్‌తో ట్రాక్టర్లు దించి గ్రామంలోనే వారం రోజుల పాటు రేపు మాపు అంటూ గడిపి ఎట్టకేలకు కొత్తగూడెం విద్యుత్ కార్యాలయంలో మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లను ఇంచి వచ్చిన అన్నదాతలు మరికొద్ది రోజుల తరువాత మరొక ట్రాన్స్‌ఫార్మర్‌ని రావికంపాడు తరలించి అది కూడా మరో రెండు రోజులు ట్రాక్టర్‌లోనే ఉంచిన అధికారులకు ఫోన్ చేయగా మళ్లీ అదే ప్రైవేట్ వ్యక్తులు వచ్చి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఐదు నిమిషాలకే మళ్లీ కాలిపోయిందని చావుకబురు చల్లగా చెప్పినారు. ఇప్పటికే ట్రాక్టర్లు కిరాయి రూ.12 వేలకు పైగా ఇచ్చామన్నారు. ఇతర ఖర్చులతో పోలీస్తే ఇప్పటికే రూ.20 వేలకు పైగా ఖర్చు వచ్చిందన్నారు. ఇప్పటికే నెల రోజులు నీళ్ల లేకపుఓవడంతో వరి పొట్టకొచ్చే దశ అవడంతో నెర్రెలు వారి ఎండిపోతుందని అన్నదాతలు కన్నీటి పర్యంతమయ్యారు. అదే విధంగా ఇప్పటికే లక్షల రూపాయలు ఖర్చు పెట్టి మిర్చిని సాగు చేస్తే అవి కూడా నీళ్ల లేక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి నిర్లక్ష్యం వల్ల అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఇలాంటి అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అయినా విద్యుత్ అధికారులు ఒక్కొక్కరు వేలల్లో, లక్షల్లో జీతాలు తీసుకుంటూ అధికారులు ఇళ్లల్లో కూర్చుంటు వారి కింద మరో ప్రైవేట్ వ్యక్తులతో పనిచేయడంతో ఇళ్లల్లో కూర్చుంటూ వారి కింద మరో ప్రైవేట్ వ్యక్తులతో పనిచేయడంతో ట్రాన్స్‌ఫార్మర్ మళ్లీ కాలిపోవడం జరిగిందని రైతులు తెలిపారు. వీరి నిర్లక్ష్యంతో ప్రభుత్వానికి ఇటు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నదాతలు మీడియాకు తెలిపారు. ఇదంతా చూస్తే మండలంలోని విద్యుత్ అధికారులకు పైసలు ఇస్తేనే విద్యుత్ అధికారులు పనిచేస్తారనర్న మాట వాస్తవము అనిపిస్తుందని అన్నదాతలు పలువురు తెలిపారు. అందువల్లనే అధికారులకు ఎన్నిసార్లు ఫోన్ చేసినాస్పందించడం లేదని తెలుస్తుంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు మండలంలోని డబ్బులు వసూలు చేస్తున్నఅధికారులపై చర్యలు తీసుకోకపోతే రాబోయే రోజుల్లో అన్నదాతల ఆవేదనను ఎవరు పట్టించుకోరేమోనని అర్ధమవుతుందని తెలుస్తుంది. వివరణ కోరేందుకు ఏడీకు పలుమార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడం గమనార్హం.

**- లైన్‌మెన్ మాటలు మనోవేదనకు గురి చేశాయి: రైతు రంగిశెట్టి రాము**



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి నెల రోజులు గడుస్తున్న క్రమంలో రైతుల తమసమస్యలు తెలిపేందుకు సంబంధిత లైన్‌మెన్‌కు ఫోన్ చేస్తే అన్నదాతలము అని చులకనగా ఏకవచనంతో పాటు మాటల్లో చెప్పలేని విధంగా మాట్లాడి మనోవేదనకు గురి చేశాడు. మరో పక్క చూస్తే చేతికి వచ్చిన వరి మిర్చి పంటలు ఎండిపోతుంటే పొలం వద్దకు వెళ్తే కడుపు తరుక్కుపోతుంది. వీరి నిర్లక్ష్యంతో మేము ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందేమోనని భయమేస్తుందని మదనపడ్డాడు. ఇలాంటి లైన్‌మెన్‌లపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**- కరెంట్ రావడం లేదని ప్రైవేటోల్ని పంపిస్తున్నారు : రైతు వెంకటేశ్వరరావు**



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి నెల రోజులు గడుస్తున్న ఎన్ని సార్లు ఫోన్ చేసినా స్పందించకపోగా ఉన్న లైన్‌మెన్ ఒకరిపై మరొకరు వంకతో కాలం వెళ్లదీస్తున్నారు. వీరు నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే రూ.12 వేలు పైగా అనవసరంటా ట్రక్టర్ కిరాయి పెట్టమన్నారు. అసలు వారు రాకుండానే ప్రైవేట్ వ్యక్తుల్ని చేత పనులను చేయించడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్‌కు చెందిన పరికరాలు ఎక్కడబడితే అక్కడ పడేస్తున్నారు. అవి పోతే మళ్లీ రైతుల్ని తెచ్చుకోమని చెప్తుంటారు. తీరా వచ్చిరాని పనితో చేయడం వల్ల పెట్టిన ఐదు నిమిషాలకే మళ్లీ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని వెంకటేశ్వరరావు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ని ఏర్పాటు చేసి రైతులు ఆదుకోవాలని వేడుకున్నారు.

**- ఏఈ తప్ప లైన్‌మెన్ వేస్ట్ : రైతు రవీందర్‌బాబు**



మండలానికి కొత్తగా వచ్చిన ఏఈ తప్ప లైన్‌మెన్ వేస్ట్ అని రైతు రవీందర్ తెలిపారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలి పోయి నెలరోజులు గడస్తున్నా ఇంత వరకు లైన్‌మెన్ ఫోన్ చేసిన స్పందించక పోవడం దురదృష్టకరమని రైతు అన్నారు. ఫోన్ చేస్తే నేను మనుషుల్ని పంపిస్తున్న అంటూ అతను ప్రైవేట్ వ్యక్తులు చేత పనిచేయడం వల్ల ఇప్పటికే నెల రోజులు అయిపోయి పంటలన్నీ ఎండిపోతున్నాయి అన్నారు. స్థానిక ఏఈ మాత్రం త్వరలోనే మా సమస్యను పరిష్కరిస్తామని తెలిపారరని రవీందర్ పేర్కొన్నారు.



# దళితబంధుతో అభివృద్ధి సాధించాలి

**-జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్**

కొత్తగూడెం, అక్టోబర్ 27 - ప్రభాతవార్త:

దళితబంధు నిధులను పెట్టుబడిగా పెట్టి అదనపు ఆదాయం సంపాదించి దళితులు అభివృద్ధి సాధించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో దళితబంధు, మన ఊరు - మనబడి కార్యక్రమాలపై నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, విద్యా, ఇంజనీరింగ్, మున్సిపల్ కమీషనర్లు ఎంపీడీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో 421 మందికి దళితబంధు పథకాన్ని మంజూరు చేశామని, మంజూరైన అన్ని యూనిట్లు ప్రారంభమయ్యాయని అన్నారు. యూనిట్లు



నిర్వహణ తీరును అధికారులు పరిశీలించి లబ్దిదారులకు యూనిట్లు నిర్వహణపై సమగ్రమైన అవగాహనర కల్పించాలని చెప్పారు. దళితబంధు నిధులను పెట్టుబడిగా పెట్టి అదనపు ఆదాయం సముపార్జించి వ్యాపార వేత్తలుగా ఎదగాలని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని చేపట్టిందని, పథకం వినియోగంతో అభివృద్ధిని సాధించాలని అన్నారు. యూనిట్లను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని, యూనిట్లు నిర్వహణ తీరును పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. యూనిట్లు ఏర్పాటు ద్వారా లబ్దిదారులు సముపార్జించిన ఆదాయ, వ్యయాలపై నివేదికలు అందజేయాలన్నారు. జిల్లాలో మొదటి విడతలో 368 పాఠశాలలు ఎంపిక కాగా రూ.30 లక్షల కంటే తక్కువ వ్యయమయ్యే పాఠశాలలు 324 ఉన్నాయని, 30 లక్షలు పైబడి ఖర్చు అయ్యే పాఠశాలలు 44 ఉన్నాయని అన్నారు. ఎస్సీ కార్పోరేషన్ ఈడీ ముత్యం, దళితబంధు నియోజకవర్గ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

# 2019 రోడ్ సేఫ్టీ బిల్లును రద్దు చేయాలి

**-ఖమ్మం ఆర్డీవో ఆఫీస్ ఎదుట ఇఫ్టూ దర్నా**

ఖమ్మం, అక్టోబర్ 27 ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ రంగంలో కీలక ప్రాముఖ్యత కలిగిందని, వస్తువు రవాణా, ప్రజా రవాణా కల్పిస్తూ ప్రజలకు సౌకర్యంగా పనిచేస్తున్న లారీ,బస్సు, ఆటో, కారు, ట్రాక్టర్ వాహనాలను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నాయి. ఈ రంగంలో డ్రైవర్లు,డ్రైవర్ కం ఓనర్ సుమారు తెలంగాణ రాష్ట్రంలో పది లక్షల మంది పరోక్షంగా 50లక్షల మంది ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఈ రంగాన్ని చిన్న చూపు చూస్తోందని భారత కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్‌టియు ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభ్వం స్పందించి అర్హులైన ఆటో కార్మికులకు డబుల్ బెడ్‌రూమ్ ఇవ్వాలని, అదే విధంగా మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రైవేట్ ఫైనాన్స్ దోపిడిని అరికట్టాలన్నారు. ఐఎఫ్‌టియు ఖమ్మం ఏరియా కార్యదర్శి కె.శ్రీనివాస్, ప్రగతిశీల ఆటో వర్కర్స్ యూనియ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎడ్లపల్లి ఉపేందర్, ఎం. లక్ష్మినారాయణ,డివిజన్ నాయకులు వీరబాబు, నాగరాజు, సురేష్, రాజేష్ ఎడ్లపల్లి సతీష్, జూపేడ అడ్డ అధ్యక్షులు సురేష్, మంగళగూడెం అడ్డా అధ్యక్షులు కృష్ణ, కోటి, ప్రణయ్, అక్కి వెంకన్న, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి

**-ఐటిడిఏ పీవో గౌతమ్‌పోట్రు**

భద్రాచలం, ప్రభాతవార్త :



గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడు పబడుతున్న ఆశ్రమ పాఠశాల, ప్రాథమిక ఉన్నత పాఠశాలలో చదవే గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు వారి యొక్క మానసిక స్థితిగతులను తెలుసుకుని వారికి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి గౌతమ్‌పోట్రు సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం గిరిజన సంక్షేమ శాఖ కమీషనర్ కార్యాలయం నుండి గిరిజన పాఠశాలల పరిశీలనకై వచ్చిన శ్రావణి కాకతీయ గవర్నెన్స్ ఫెలో, ఓఎస్‌డీ సుధాకర్‌లతో, ఐటిడిఏ విభాగంలోని విద్యాశాఖ అదికారులతో తన ఛాంబర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. మారుమూల ప్రాంతాలలోని గిరిజన గ్రామాలలోని కుటుంబాలలో ఉంటున్న విద్యార్థిని, విద్యార్థులు యొక్క నైపుణ్యాలను పరిశీలించి గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో వారికి నాణ్యమైన విద్య అందస్తే ఆ విద్యార్థులు ఆశ్రమ పాఠశాలలో చేరిక మంచి ఫితాలు సాధిస్తారని ఆయన అన్నారు. అనంతరం గిరిజన పాఠశాలల పరిశీలనకై వచ్చిన శ్రావణి, సుధాకర్ మాట్లాడుతూ .. గిరిజన విద్యార్థులతో బిడియం పోగొట్టి వారి భవిష్య త్తును బంగారుబాటలో పయనించడానికి గిరిజన విద్యను తగిన రీతిలో మానిటరింగ్ చేసేలా సంబంధిత పీఎంఆర్‌సీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని రమాదేవీ, ఏసీఎంవో రమణయ్య, ఏటీడీవో నరసింహారావు, జీసీడీవో అలివేలుమంగతాయారు, అసిస్టెంట్ ఏసీఎంవో బావసింగ్, పాల్గొన్నారు.